ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు

బుధవారం 8 అక్టోబరు 2025 | 5

ఈ-క్రాప్ 93శాతం పూర్తి

- జిల్లాలో ఇప్పటివరకు లక్షా 98వేల ఎకరాల నమోదు
- పంటల బీమా, పెట్టుబడి రాయితీకి ఈ-క్రాప్ తప్పనిసరి
- నమోదుకు ఈనెల 25 చివరి తేదీ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి, పంటల బీమా, పెట్టుబడి రాయితీ అందుకోవడానికి ఈ-క్రాప్ నమోదు ఎంతోగానో ఉపయోగపడుతుంది. జిల్లాలో ఇప్పటివరకు వరకు 93శాతం బుకింగ్ జరిగింది. ఈనెల 25 ఆఖరుతేదీగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మిగిలిన ఏడు శాతాన్ని వేగవంతం చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 2లక్షల 14వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేయగా ఇప్పటివరకు లక్షా 98వేల ఎకరాల్లో పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఇంకా 16వేల ఎకరాల్లో పంటల వివరాలను నమోదుచేయాల్సిఉంది. జిల్లా వ్యాప్తంగా 1,40,407 రైతులు ఉండగా 93 శాతం మంది పంటలు నమోదయ్యాయి. దీంట్లో వరి, పత్తి, అపరాలు వంటి పంటలు ఉన్నాయి.కరప, తుని, కిర్లంపూడి మండలాల్లో ఈ-క్రాప్ నూరుశాతం నమోదైంది. కాజులూరు, కాకినాడ అర్బన్, ఏలేశ్వరం, శంఖవరం, తొండంగి మండలాల్లో 99శాతం, ప్రత్తిపాడు 96శాతం, జగ్గంపేట 89శాతం, రౌతులపూడి 86శాతం, పెద్దాపురం 92శాతం, సామర్లకోట 89శాతం, గొల్లప్రోలు 84శాతం, యు.కొత్తపల్లి 93శాతం, కాకినాడ రూరల్ 92శాతం, పిఠాపురం 88 శాతం, కోటనందూరు 95శాతం, గండేపల్లి 93శాతం, తాళ్లరేవు 90శాతం బుకింగ్ జరిగింది. పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, వాతావరణ ఆధారిత బీమా వంటి అన్ని పథకాలకు ఈ-క్రాప్ తప్పనిసరి చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం కలిగితే ఈ-క్రాప్ ఆధారంగా పరిహారం విడుదలచేస్తారు. జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యం సేకరణ జరుగుతోంది. ఈ-క్రాప్‌లో గణాంకాలను ఆధారంగా చేసుకునే ప్రభుత్వం కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోంది. జిల్లాలో ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో ప్రకృతి వైపరీత్యాల వలన చేతికొచ్చే పంట నీటి పాలవుతోంది. ఈ-క్రాప్‌లో నమోదైన పంటలకు ఎలాంటి భయం ఉండదు. పంటల బీమా పథకం ద్వారా పరిహారం పొందవచ్చు.

మరో పదిరోజుల్లో పూర్తి చేస్తాం
-విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ

జిల్లాలో ఈ-క్రాప్‌నమోదును 93శాతం పూర్తి చేశాం. మరో పది రోజుల్లో మిగిలిన ఏడు శాతం నమోదు పూర్తి చేయడానికి కార్యాచరణ అమలు చేస్తున్నాం. జిల్లావ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరుగుతుంది.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ బీచ్ అభివృద్ధి

- ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): 'కాకినాడ సముద్రతీరాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం... సందర్శకులు, విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు యుద్ధ విమాన మ్యూజియాన్ని వినియోగంలోకి తెచ్చాం... కౌడా నిధులతో బీచ్ పార్కు, బీచ్ ఫ్రంట్ అభివృద్ధి పనులు ప్రారంభించి మరింతఆహ్లాదం అందేలా కృషిచేస్తున్నాం' అని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో రూ.4.58కోట్ల కౌడా నిధులతో బీచ్‌ఫ్రంట్, బీచ్ పార్కు, అభివృద్ధి, ఆధునికీకరణ పనులను మంగళవారం వారు జేసీ రాహుల్‌మీనా, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరంలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీచ్ అభివృద్ధితో మత్స్యకారులకు వేటతోపాటు ప్రత్యామ్నాయంగా పర్యాటకరంగంలో పెద్దఎత్తున జీవనోపాధి, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రక్షణరంగంలో 30ఏళ్లపాటు సేవలందించిన యుద్ధవిమానాన్ని ఇక్కడకు తీసుకొచ్చి మ్యూజియం ఏర్పాటు చేశామన్నారు. బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియాన్ని సందర్శించి పర్యాటకులతో మాట్లాడారు. ఎంపీపీ అనంతలక్ష్మి, ఏపీ ఖాదీ,విలేజ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, సోదె ముసలయ్య, ఎంపీడీవో సతీష్, గ్రామ కార్యదర్శి లక్ష్మీదేవి పాల్గొన్నారు.



కాకినాడ సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ ఫ్రంట్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల, జేసీ రాహుల్

కుడా కూడానా..



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

- నెలలు గడుస్తున్నా ఎటూ తేలని కుడా చైర్మన్ కుర్చీ వ్యవహారం
- డీసీసీబీ చైర్మన్ పదవి దక్కడంతో కుడాకు తుమ్మలబాబు మే నెలలో రాజీనామా
- అయినా ఇప్పటికీ ఆయనే కొనసాగుతున్న వైనం
- కుడా కుర్చీ పదవి కోసం జనసేనలో పలువురు నేతల ప్రయత్నాలు
- డీసీసీబీ చైర్మన్ వదులుకున్నందున కుడా ఇవ్వాలంటూ టీడీపీ పట్టు

నెలలకు నెలలు గడుస్తున్నా కుడా(కాకినాడ నగర అభివృద్ధి సంస్థ) చైర్మన్ కుర్చీ వ్యవహారం ఎటూ తేలడంలేదు. ఈ పదవి కోసం అటు జనసేన, ఇటు టీడీపీనుంచి ఎవరికివారే ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం కుడా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జనసేన నేత తుమ్మలబాబు తనకు డీసీసీబీ చైర్మన్ పదవి దక్కడంతో కుడా పదవికి మేలో రాజీనామా చేశారు. అయినా ఇప్పటికీ ఆయన్నే ఆ కుర్చీలో కొనసాగిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

కుడా కాక..

కుడా చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు జనసేన, టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నా అందని ద్రాక్షలా మారడంతో ఈసురోమంటున్నారు. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న తుమ్మలబాబు ఆ పదవికి రాజీనామా చేసినా జనసేన అధిష్ఠానం ఆమోదించలేదు. దీంతో సీట్లో ఇంకా ఆయనే కొనసాగుతుండడంతో ఆశావహులు ఛాన్స్ దక్కక తలపట్టుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేయగా కొన్ని టీడీపీ, మరికొన్ని జనసేన పంచుకున్నాయి. ఇందులో భాగంగా జనసేన జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తుమ్మలబాబుకు పార్టీ అధిష్ఠానం తమ వంతుగా వచ్చిన కుడా చైర్మన్ పోస్టును గతేడాది నవంబరులో కట్టబెట్టింది. ఆ తర్వాత ఈ ఏడాది మేలో రాష్ట్రవ్యాప్తంగా ప్రకటించిన డీసీసీబీ చైర్మన్ కుర్చీల్లో సమీకరణాల్లో మార్పు రావడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవిని జనసేన తీసుకుంది. ఈ పోస్టును మళ్లీ తుమ్మలబాబుకు కట్టబెట్టింది. దీంతో నిబంధనల ప్రకారం రెండు పదవుల్లో ఒకదాన్ని వదులుకోవాల్సి ఉండడంతో డీసీసీబీ పదవి పోకుండా ఆయన కుడా చైర్మన్ కుర్చీకి మేలో రాజీనామా చేశారు. దీంతో ఈ పదవి తమకు దక్కుతుందని జనసేనలో పలువురు నేతలు భావించారు. కానీ తుమ్మలబాబు కుడా చైర్మన్ పదవికి రాజీనామా చేసినా పార్టీ అధిష్ఠానం మాత్రం ఆరు నెలల నుంచీ దాన్ని ఆమోదించలేదు. దీంతో తుమ్మలబాబు డీసీసీబీ చైర్మన్‌తోపాటు కుడా చైర్మన్‌గాను కొనసాగుతూ రెండు పదవుల ప్రొటోకాల్ అనుభవిస్తున్నారు. ఇప్పుడిది కొందరు జనసేన నేతల్లో అసంతృప్తి రాజేస్తోంది. పార్టీలో ఎప్పటినుంచో ఉన్నా అధికారంలోకి వచ్చాక కనీసం గుర్తింపు ఇవ్వడం లేదని వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందులోభాగంగా గతనెల 20న కాకినాడలో కొందరు జనసేన నేతలు రహస్య సమావేశం ఏర్పాటు చేసి తమ ఆవేదన వెళ్లగక్కారు. తుమ్మలబాబు ప్రస్తుతం జనసేన జిల్లా అధ్యక్షుడిగా, పెద్దాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జిగా కూడా ఉన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఇటీవల పార్టీ ప్రకటించిన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. పార్టీలో సీనియర్ నేతలు ఉన్నా ఒక్కరికే ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదంటున్నారు. ఇటీవల సీఎం పెద్దాపురం నియోజకవర్గ పర్యటనకు వచ్చినప్పుడు తుమ్మలబాబు డీసీసీబీ చైర్మన్, కుడా చైర్మన్ ప్రొటోకాల్‌తో రెండు కార్లలో తిరగడాన్ని వారంతా గుర్తుచేసి అసహనం వ్యక్తం చేశారు. ఈ రహస్య సమావేశం వ్యవహారం జనసేన అధిష్ఠానం దృష్టికి కూడా వెళ్లింది. కుడా చైర్మన్ కుర్చీ ఖాళీ అయితే తమకు ఇవ్వాలంటూ పలువురు జనసేన సీనియర్ నేతలు ఇప్పటికే అధ్యక్షుడు పవన్ దృష్టికి తీసుకువెళ్లారు. మెట్టలో ఓ పార్టీ సీనియర్ నేత, పిఠాపురం జనసేనలో చేరిన ఓమాజీ ఎమ్మెల్యే, అదే నియోజకవర్గంలో ముందునుంచీ ఇన్‌ఛార్జులుగా పనిచేసిన మరికొందరు నేతలు తమకు కుడా కుర్చీ లేదా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఏదొకటి ఇవ్వాలని పట్టుబడుతున్నారు.

ఇదైనా తీసుకుందాం..

కుడా చైర్మన్ కుర్చీ తమకు ఇవ్వాలంటూ తాజాగా టీడీపీ పట్టుబడుతోంది. డీసీసీబీ చైర్మన్ పదవిని జనసేనకు త్యాగం చేయాల్సి రావడంతో కుడాను ఇవ్వాలని కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డీసీసీబీ చైర్మన్ పదవులను టీడీపీ, జనసేన పంపకాల్లో భాగంగా ఉమ్మడి తూ.గో జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవి టీడీపీ, ఉమ్మడి పశ్చిమ గోదావరి డీసీసీబీ చైర్మన్ కుర్చీ జనసేన పంచుకున్నాయి. ఆఖర్లో ఈ రెండు కుర్చీలు సర్దుబాటులో భాగంగా పశ్చిమ డీసీసీబీ చైర్మన్ కుర్చీని టీడీపీ తీసుకోగా ఉమ్మడి తూ.గో. పదవిని జనసేన తీసుకుంది. దీంతో ఈ కీలక పదవిపై ఆశలు పెంచుకున్న టీడీపీ నేతలు నిరాశపడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో డీసీసీబీ త్యాగం చేసినందున కుడా కుర్చీ పార్టీ తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ సమక్షంలో పలువురు టీడీపీ కీలక నేతలు ఇటీవల ప్రతిపాదించారు. ఈ అంశాన్ని జనసేన దృష్టికి కూడా తీసుకువెళ్లారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో కీలక పదవులన్నీ జనసేనకు వెళ్లడంతో ముఖ్యమైన నామినేటెడ్ పదవులేవీ టీడీపీకి దక్కలేదని, దీంతో పార్టీలో కాపు, బీసీ సామాజికవర్గ నేతలకు పదవుల్లో న్యాయం జరగాల్సి ఉందని పార్టీ అధిష్ఠానం దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో కుడా చైర్మన్ పదవిని తీసుకుని కాపు, బీసీ సామాజిక వర్గాల నేతల్లో ఎవరొకరికి కట్టబెట్టి న్యాయం చేయాలని వివరించారు. ఈ నేపథ్యంలో టీడీపీ తరఫున ప్రతిపాదనను జనసేన ముఖ్య నేతలకు కూడా ఇటీవల వివరించారు. దీనిపై తర్జన భర్జనలు పడుతున్నట్టు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, చిత్రంలో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, కోనసీమ డీఆర్వో రాజకుమారి తదితరులు

కూటమి వర్సెస్ వైసీపీ

వాడివేడిగా ఉమ్మడి జిల్లా జడ్పీ సమావేశం

- వైద్య కళాశాలల పీపీపీపై రగడ
- రద్దుకు వైసీపీ సభ్యుల డిమాండ్
- ఇరుపక్షాల మధ్య తీవ్ర చర్చ
- చివరకు తీర్మానం ఆమోదం
- జీఎస్టీపై తీర్మానానికి పట్టు
- ఆమోదించని వైసీపీ జడ్పీటీసీలు
- సభ్యుల మధ్య మాటల యుద్ధం

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర శాసన సభ, శాసన మండలిలో చర్చ జరిగి ప్రభుత్వం వివరణ ఇచ్చిన దృష్ట్యా జడ్పీ సమావేశంలో చర్చ అవసరం లేదు. జీఎస్టీ తగ్గించడంపై ప్రధాని మోదీ, జీఎస్టీ మండలికి అభినందనలు తెలపాలి అంటూ అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించారు. అయితే వైసీపీ సభ్యులు వ్యతిరేకించారు. ఇలా ఇరు పక్షాల వాదోపవాదాలతో కాకినాడలోని జీఎంసీ బాలయోగి జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయాలని సభ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయమై శాసనసభ, శాసనమండలిలో చర్చ జరిగిందని, ఈ అంశంపై ప్రభుత్వం వివరణ ఇచ్చిన దృష్ట్యా జడ్పీ సమావేశంలో చర్చించాల్సిన అవసరం లేదన్నారు. దీంతో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ నచ్చచెప్పి వారిని తిరిగి సమావేశానికి హాజరయ్యేలా ఒప్పించారు. వైద్యకళాశాల అంశంపై చర్చకు అనుమతించారు. ఎమ్మెల్సీలు పేరాబత్తుల, సోమువీర్రాజు మాట్లాడుతూ నిధుల కొరతను అధిగమించి వైద్య సేవలను సత్వరం పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు పీపీపీ అవసరమని వివరించారు. తీవ్ర చర్చ అనంతరం వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో అప్పగింత రద్దు చేయాలని జడ్పీ చైర్మన్ ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది. యూరియా కొరత పట్ల సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ పరిస్థితిని సభ్యులకు వివరిస్తూ, 2023తో పోలిస్తే 2025 ఖరీఫ్‌లో 3 వేల మెట్రిక్ టన్నులు అధికంగా యూరియా పంపిణీ చేశామని, పానిక్ పర్చేజెస్ కారణంగా కొరత ఎదురవుతోందని తెలిపారు. ప్రస్తుతం యూరియా బఫర్ స్టాక్ ఉందని, రైతులఅవసరాలకు ఇబ్బంది లేదన్నారు. ఇరిగేషన్ - (మిగతా 7వ పేజీలో)

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పర్యటనకు ఏర్పాట్లు



పిఠాపురంలో ఆధునికీకరిస్తున్న ఆర్అండ్‌బీ అతిథిగృహం

- రెండు లేదా మూడు రోజులు ఉండే అవకాశం
- పిఠాపురం ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆధునికీకరణ

పిఠాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ త్వరలోనే నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కొత్తపల్లి మండలంలోని మత్స్యకారులు ఉప్పాడవద్ద చేపట్టిన ఆందోళన, తదనంతర పరిణామాల నేపథ్యంలో ఈ నెల 10వతేదీలోగా వస్తానని కలెక్టర్ ద్వారా పవన్ సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. ఆయన అనారోగ్యానికి గురికావడం, ఇతర కారణాలతో ఈలోగా ఉప్పాడ వచ్చి మత్స్యకారులతో సమావేశమవుతారా లేక రెండు, మూడు రోజులు ఆలస్యంగా వస్తారా అనేది నిర్ధారణ కావాల్సిఉంది. ఇందుకు తగిన ఏర్పాట్లుచేయాలని ఇప్పటికే డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో సమావేశమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా ఐదుగురు సభ్యులతో కమిటీల ఏర్పాటుకు నియమించిన ఫైవ్‌మెన్ కమిటీ ఆయా మండలాల్లో పర్యటించి కమిటీ సభ్యుల నియామకానికి అభిప్రాయాలు సేకరించారు. పిఠాపురం పట్టణం, మండల పరిధిలో ఈ ప్రక్రియ పూర్తికావాల్సిఉంది. దీనిపై పవన్ సమీక్షిస్తారని సమాచారం.

పవన్ బస చేసేందుకు వీలుగా..

కాగా పవన్‌కల్యాణ్ బస చేసేందుకు వీలుగా పిఠాపురంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహాన్ని ఆధునికీకరిస్తున్నారు. దీనికి రూ.50లక్షలు కేటాయించారు. ప్రస్తుతం అందులో ఉన్న రెండు గదులను యుద్ధప్రాతిపదికన సూట్ రూమ్‌లుగా తీర్చిదిద్దుతున్నారు. మీటింగ్‌హాలుతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. ఏయే పనులు చేపట్టాలనే విషయమై కలెక్టర్ షాన్‌మోహన్ పరిశీలన జరిపి అధికారులకు సూచనలిచ్చారు. అందుకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయి. పవన్‌కల్యాణ్ ఇక పర్యటనలకు వచ్చే సమయంలో ఇక్కడే బస చేయనున్నారు. సమావేశాలను కూడా ఇదే ఆవరణలో నిర్వహిస్తారని అధికారవర్గాలు వెల్లడించాయి.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ నియామకం

కొత్తపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ సూచనలతో కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారంకోసం ఒక కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీలో పరిశ్రమలు, మత్స్యశాఖల కమిషనర్లు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ, కాకినాడ జిల్లా కలెక్టర్, ఆయన నామినేట్ చేసిన మత్స్యకారులు ఉంటారు. తమ సమస్యలపై తక్షణం స్పందించి కమిటీ ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు మత్స్యకారులు ధన్యవాదాలు తెలిపారు.



భద్రత ఏదీ?

- కాకినాడ జీజీహెచ్‌లో సెక్యూరిటీ డొల్ల
- తరచూ దొంగతనాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం
- రెండురోజులకు ఒక బైక్ అపహరణ
- చోద్యం చూస్తున్న పోలీసులు

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో సెక్యూరిటీ బలహీనంగాఉంది. నిరుపేదలకు, సామాన్యులకు ఆరోగ్య ప్రదాయినిగా పేరొందిన ఈ పెద్దాస్పత్రికి వివిధ కారణాలతో ప్రతిరోజూ 4వేలమంది రోగులు వస్తుంటారు. వారికి సహాయకులుగా మరో 5వేలమంది వరకు వస్తుంటారు. సందిట్లో సడేమియాలా పసికందులను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించే దొంగలు, బైక్ దొంగలు వస్తుంటారు. వైద్యులు, వైద్యవిద్యార్థులు వారి విలువైన వస్తువులను పక్కన పెట్టి రోగులకు వైద్యచికిత్స అందించే ప్రక్రియలో ఉండగా వాటిని కాజేసే దొంగలు, ఓపీక్యూలో నిల్చున్న వారినుంచి దారి చార్జీలను దొంగతనం చేసి పరారయ్యే వారి సంఖ్య ఇటీవలకాలంలో పెచ్చుమీరుపోతోంది.

సెక్యూరిటీ కాంట్రాక్ట్ మారడంతో..

ప్రస్తుతం సెక్యూరిటీ కాంట్రాక్ట్ మారి కొత్తగా కార్తికేయ సెక్యూరిటీస్ పేరుతో కొత్త కాంట్రాక్ట్ మనుగడలోకి వచ్చింది. ఆ కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో జీజీహెచ్‌లో జరిగే నేరాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఇందుకు సగం కారణం జీజీహెచ్ సెక్యూరిటీ వైఫల్యం కాగా ఈ నేరాలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోవడంతో మరో సగం వైఫల్యం పోలీసులదిగా కనిపిస్తోంది. జీజీహెచ్‌లో పలు విభాగాల వార్డుల్లో 2వేల మందికి పైగా చికిత్స పొందుతూ ఉంటారు. వారికి సపర్యలు చేసేందుకు వారి కుటుంబీకులు లేదా బంధువులు ద్విచక్ర వాహనాలపై జీజీహెచ్‌కు వస్తుంటారు. ఆతృత, ఆందోళనలో ఉన్న వారు ఆస్పత్రి ప్రాంగణంలో ఎక్కడో ఒకచోట వాహనం పార్క్ చేసి హడావిడిగా చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లిపోతారు. అనంతరం వారు ఓ అరగంటలో తిరిగి తమ వాహనం వద్దకు వచ్చి చూసుకునే సరికి అది మాయమవుతోంది. అక్కడినుంచి వారు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి వాహనం కనబడకపోయేసరికి గత్యంతరం లేని పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. కానీ, పోలీసులు అదిగో..ఇదిగో అని కాలయాపనచేస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలేదు. అపహరణకు గురైన వాహనాల గురించి దర్యాప్తు చేయడంలేదు. కాగా వైద్యచికిత్స అందించే వైద్యుల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఏ విభాగానికి ఆ విభాగంలో వారికి కేటాయించిన గదుల్లో వారి విలువైన సామగ్రిని భద్రపర్చుకుంటారు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్, హౌస్ సర్జన్ వైద్యవిద్యార్థులకు ప్రత్యేకంగా గదులు ఉండవు కాబట్టి వారు వైద్యచికిత్స అందించే వార్డులోనే సామాగ్రిని భద్రపర్చుకుంటారు. వారు విధి నిర్వహణలో రోగికి చికిత్స అందిస్తున్న సమయంలో వారి సామాగ్రి అపహరణకు గురవుతున్నాయి. సుదూరప్రాంతాలనుంచివచ్చి వైద్యవిద్యను అభ్యసిస్తూ వైద్యచికిత్సను అందజేస్తున్న వారి విలువైన వస్తువులకు భద్రత లేకపోవడం దారుణమని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. జీజీహెచ్‌లో రోజు విడిచి రోజు ఒక ద్విచక్ర వాహనం అపహరణకు గురవుతున్నా ఎవరికీ పట్టడంలేదు. 2024లో మొత్తం 180 మోటారు బైక్‌లు అపహరణకు గురికాగా ఈ ఏడాది ఇప్పటివరకు 100 మోటారుబైక్‌లు చోరీ అయినట్లు పోలీస్ గణాంకాలే చెబుతున్నాయి.

భద్రత పెంచాలి

జీజీహెచ్‌లో మాతా శిశు విభాగం కీలకమైనది. అక్కడ గతంలో అప్పుడే పుట్టిన చంటి బిడ్డలను ఎత్తుకుపోయేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అప్పుడు తల్లులు విలపించిన తీరు వర్ణనాతీతం. అటువంటి సంఘటనలు జరిగాక అప్పటినుంచి ఆస్పత్రివర్గాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. ప్రస్తుతం కాంట్రాక్ట్ మారాక సెక్యూరిటీ తీరులో నిర్లక్ష్యం, డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. జీజీహెచ్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బోయవాడైన ఒక సాధారణ వ్యక్తి మహా రుషిగా మారి రామాయణం వంటి దివ్యమైన గ్రంథాన్ని రచించారనీ, ఇది ఒక గొప్ప విశేషమని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఇతిహాసాల్లో తొలి కావ్యంగా పేరొందిన రామాయణం గ్రంథాన్ని సమాజానికి అందించిన మహర్షి వాల్మీకి జీవితం మన అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆయన అకుంఠిత దీక్షతో చిరకాలం చేసిన తపస్సుతో స్వయం మహర్షి అయ్యారన్నారు. రామాయణం వంటి మహాకావ్యాన్ని ఈ సమాజానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ షాన్ మోహన్, జేసీ రాహుల్‌మీనా, రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి లల్లీ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కాకినాడక్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ జి.బిందుమాధవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి జీవితం, రచనలు, ఆయన సమాజానికి అందించిన సేవలను కొనియాడారు.అన్ని వర్గాల ప్రజలు మహర్షి ఆదర్శాలను అనుసరించాలని ఆకాంక్షించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.శ్రీహరిరావు, ఏవో సత్తిపండు పాల్గొన్నారు.



మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఉద్యాన పంటలపై నత్తల దాడి


గంగలకుర్రులో కొబ్బరిచెట్టుని పట్టుకున్న నత్తను చూపిస్తున్న రైతు ఆంజనేయులు.. బెండ మొక్కను పట్టుకున్న నత్త

- కోనసీమలో తొలిసారిగా గంగలకుర్రులో గుర్తింపు
- ఇప్పటికే రూగోస్ తెల్లదోమతో తీవ్రంగా నష్టపోయిన రైతు
- కూరగాయలు, తీగపాదులను తినేస్తున్న నత్తలు
- తెల్లవారేసరికి పంటలపై కనిపించని నత్తలు
- వణికిపోతున్న అన్నదాతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న శాస్త్రవేత్తలు
- ఉప్పు ద్రావణంతో పిచికారితో నివారణ సాధ్యం



అంబాజీపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ములిగే నక్కపై తాటిపండు పడినట్టుగా మారింది రైతన్నల పరిస్థితి. గత ఐదేళ్లుగా కొబ్బరితోపాటు ఉద్యాన పంటలను ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగచేసిన రూగోస్ తెల్లదోమ పూర్తిగా నివారణకాకముందే ఆఫ్రికా నత్తలు కోనసీమలోకి ప్రవేశించి కొబ్బరితోపాటు అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు, పాదులను పీల్చిపిప్పుచేస్తున్నాయి. దీంతో ఇప్పటికే నష్టాలు ఎదుర్కొంటున్న రైతులు వణికిపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామంలో ఈ ఆఫ్రికా నత్తల దాడిని రైతులు చూసి ఆశ్చర్యపోయారు. గంగలకుర్రు గ్రామానికి చెందిన రైతు చిరతపూడి ఆంజనేయులు అదే గ్రామంలో జగ్గన్నతోట సమీపంలో వంగ, బెండ, ఆనప, దొండ, వివిధ రకాల కూరగాయలు సాగుచేస్తున్నాడు. గత రెండు నెలలుగా మొక్కలు, కాయలను పిప్పిచేస్తున్నాయి. దీంతో ఆ రైతు పురుగు, మందులు పిచికారి చేసిన్నప్పటికి ఫలితం లేకపోయింది. అయితే కొన్ని రోజుల తరువాత తెల్లవారుజామున పొలంలోకి వెళ్లి చూడగా ఆ రైతుకు చెట్లను నత్తలు పట్టుకుని కాయలు తినడాన్ని గమనించి ఆశ్చర్యపోయాడు. వీటి వల్ల సుమారు రూ.50వేలకుపైగా నష్టపోయిన్నట్టు రైతు ఆంజనేయులు వివరించాడు.

పార్వతీపురం, నల్లజర్లలో గుర్తింపు

మొన్నటిదాకా విశాఖ, మన్యం జిల్లాలో రైతులను కలవరానికి గురిచేసిన ఈ నత్తలు, తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దేవరపల్లిలో ఆ ఆఫ్రికన్ నత్తళ్లను పంటలపై దాడిచేయడాన్ని ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పుడు ఈ నత్తలు కోనసీమ జిల్లాలోకి ప్రవేశించాయి. కేరళ నుంచి వక్కమొక్కలను ఆ ప్రాంతానికి తీసుకురావడంతో ఈ నత్తలు వచ్చినట్టు గుర్తించారు. ప్రస్తుతం కోనసీమలోని అంబాజీపేట మండలం గంగలకుర్రు జగ్గన్నతోట ప్రాంతంలో ఈ నత్తలు ఉండడాన్ని గుర్తించారు. సూర్యరశ్మికి ముందే నత్తలు కనిపించకుండా వెళ్లిపోతున్నాయి.

ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం

ఉద్యాన, వ్యవసాయ పంటలపై ఆశించి విపరీతమైన నష్టాన్ని కలిగించే ఆఫ్రికన్ నత్తలను ముందుగా గుర్తించి నివారించకుంటే భవిష్యత్‌లో రైతులు తీవ్రనష్టాలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. కేరళరాష్ట్రంలో ఈ ఆఫ్రికన్ నత్తల వల్ల అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయినట్టు వివరించారు. మన ప్రాంతంలో మామూలుగా ఉండేవి తెల్లనత్తలు. ఇవి పరిమాణంలో చిన్నవి. వీటివల్ల పంటలకు పెద్దగా నష్టం ఉండదు. కానీ ఇవి ఆఫ్రికా దేశం నుంచి వందేళ్ల కిందటే మనదేశంలోకి ఈ నత్తలు వచ్చాయి. ఇది పరిమాణంలో పెద్దదిగా ఉంటుంది. పొలంలోని తప్పులు, ఆకుల కింద గాలి, వెలుతురు తగలని ప్రదేశాలలో ఉండి జూలై నుంచి ఫిబ్రవరి వరకూ సంతానోత్పత్తికి అనుకూలంగా ఉన్నప్పుడు 100- 400 గుడ్డు పెట్టి పిల్లలను చేస్తాయి. ఏడాదికి కనీసం 1000- 1200 పిల్లలను పెడుతుంది. ఈ నత్తల జీవితకాలం సుమారు 5-6 సంవత్సరాలు. ఈ కాలంలో సుమారు 5000 పిల్లలను పెడుతాయి. ఇవి పెద్దఎత్తున పిల్లలు పెట్టడం వల్ల ఇవి బొప్పాయి. అరటి, జామ, కూరగాయలు, వక్కల, ఆయిల్‌ఫామ్ వంటి పంటలను ఆశించి కనీవిని ఎరగని రీతిలో రైతులకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. ఈ నత్తల వల్ల మొక్కజొన్న, పత్తి లాంటి ఇతర పంటలకు కూడా పెద్దఎత్తున నష్టాన్ని కలిగిస్తున్నాయి. కానీ నీరు నిల్వ ఉండే వరి పంటల విషయంలో పెద్దగా నష్టం ఉండదు.

నత్తల నివారణ చర్యలు

రైతులు ఒత్తుగా గాలి, వెలుతురు, సూర్యరశ్మి సోకకుండా ఉండేటట్టు పంటలు వేసుకోకూడదు. వేర్లతోపాటు కలుపు మొక్కలను, చెత్త కుప్పలను పొలం నుంచి తొలగించాలి. ఎప్పటికప్పుడు తోటల్లో అంతర సేద్యంగా శుభ్రంగా చేసుకుని ఎక్కడ తుప్పలు లేకుండా చూసుకోవాలి. రాత్రులు నీరు పారించకూడదు. పగటిపూట మాత్రమే నీటిపారుదల ఇవ్వాలి. అవకాశం ఉంటే బాతులు, కోళ్లు లాంటివి పెంచుకోవాలి. పొలం గట్లపైన ఉప్పునీటిలో ఉంటే ఒక కిలో ఉప్పును 4 లీటర్లతో కలిపిన ద్రావణంలో ముంచిన గోనె సంచులు పరిచినట్టయితే ఇతర పొలాల్లో నుంచి వేరే పొలంలోకి ఇవి రాకుండా ఉంటాయి. రైతులు చేతికి గ్లౌజులు తప్పనిసరిగా వేసుకుని ఉప్పు ద్రావణంలో వాటిని వేసే అవి చనిపోతాయి. వరితవుడు 25 కిలోలు, థియోడికార్బ్ 100 గ్రాములు గుళికలు, బెల్లం 3 కిలోలను 100 గ్రాముల ఆముదంతో కలిసి చిన్న చిన్న ఉండలు చేసి పొలంలో అక్కడక్కడ పెట్టడం ద్వారా ఆ విషపు ఉండలు తిని చనిపోతాయి. అలాగే మెటల్డిహైడ్ గుళికలు (2.5-4 శాతం)ను ఎకరానికి 3- 5 కిలోలు తీసుకుని వచ్చి ఎకరా పొలంలో చల్లితే చనిపోతాయి. చిలేటెడ్ కాపర్ 3 గ్రాములు, ఫెర్రోమేగ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేస్తే ఆ నత్తలు కేవలం 2 నిమిషాల్లో కిందపడిపోయి 95 శాతం చనిపోతాయి. కొన్ని కింద పడినప్పటికీ కదలిక ఉంటే వాటిని 5కిలోల గడ్డ ఉప్పు కరగించిన ద్రావణంలో వేస్తే ఖచ్చితంగా చనిపోతాయి. చివరి నత్త వరకూ చంపాలి. అలా చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం కోనసీమలోని గంగలకుర్రులో నత్తలు ఉద్యాన పంటలను నష్టపరుస్తున్నట్టు రైతు తెలియజేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తాం. రైతులు అప్రమత్తంగా ఉండి వాటిని ముందుగానే గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలి. లేకుండా లేకుండా భవిష్యత్‌లో ఉద్యాన పంటలను వేసుకునే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

- డాక్టర్ వి.అనూష, కీటకవిభాగం శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన కేంద్రం, అంబాజీపేట

ఎన్నో మందులు పిచికారీ చేశాం..

మొక్కలకు పురుగు పట్టాయని అనేక రకాల పురుగు మందులు పిచికారి చేశాం. అయినప్పటికీ పంటలు నాశనం అవుతున్నాయి. అయితే ఒక్క రోజు తెల్లవారుజామున వెళ్లి మొక్కలను పరిశీలిస్తే ఈ నత్తలు చెట్లను పట్టుకుని తినేస్తున్నాయి. పంటకు సుమారు రూ.50వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుని ఈ నత్తల నివారణను అరికట్టాలి.

- చిరతపూడి ఆంజనేయులు, రైతు, గంగలకుర్రు

ఆధార్ ఉంటేనే రైలు టికెట్



- టికెట్ల జారీలో మార్పులు చేసిన రైల్వేశాఖ

మండపేట,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రైలు టిక్కెట్ల దుర్వినియోగాన్ని అరికట్టడంతోపాటు ప్రయాణికులకు మేలు చేసేలా రైల్వేశాఖ పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈఏడాది జూలై1నుంచి పలు సంస్కరణలను చేపట్టింది. తాజాగా ఈనెల 1నుంచి మరిన్ని నిబంధనలు అమల్లోకి తీసుకువచ్చింది. ఐఆర్‌సీటీసీ యాప్ వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఉన్న మొబైల్ నెంబరుతో ఆధార్‌కార్డు లింక్ అయ్యే లా చేసింది.

గతంలో ఐఆర్‌సీటీసీ ఖాతా ఉంటే టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు ఉండేది. కొందరు ఏజెంట్లు ఒక్కో ఖాతానుంచి ఎక్కువగా టిక్కెట్‌లు బుక్ చేసుకుని దుర్వినియోగానికి పాల్పడేవారు. దీంతో సాధారణ ప్రయాణికులుకు తత్కాల్ టిక్కెట్‌లు లభ్యం కావడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో ఈఏడాది జూలై 1నుంచి నూతన నిబంధన అమల్లోకి తెచ్చింది. ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఉన్న మొబైల్ నెంబరుతో ఆధార్‌కార్డు అనుసంధానమై ఉంటేనే బుక్ చేసుకునేలా మార్చింది. ఏసీ తత్కాల్‌ను ఉదయం 10గంటలనుంచి,స్లీపర్ తత్కాల్ టిక్కెట్లను 11గంటలనుంచి రిజర్వేషన్ చేసుకునేలా మార్పు చేసింది. తాజాగా ఈనెల 1నుంచి సాధారణ రిజర్వేషన్ టిక్కెట్లకు ఇదే విధానం అమలు చేస్తోంది. ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఉన్న చరవాణి ఫోన్ నెంబరుతో ఆధార్ లింక్ చేసుకున్న ప్రయాణికులు ఉదయం 8గంటలకే టిక్కెట్లను తీసుకునేలా, లింక్ కానీ వారు ఉదయం 8.15గంటలనుంచి టిక్కెట్‌లు తీసుకునేలా మార్పు తెచ్చింది.

రైతుకు చేయూత

- ఉద్యాన పంటలకు రాయితీలతో ప్రోత్సాహం



మండపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):మన దేశంలో రైతుకు వ్యవసాయం ప్రాణాధారం. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతి కందే సమయంలో వారు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలో సాగులో వారికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు, యాంత్రీకరణ సామాగ్రిని రైతులకు ప్రభు త్వం సబ్సిడీపై అందిస్తోంది. ఈ మేరకు జిల్లా ఉద్యానవన శాఖాధికారి రమణ వివరాలను వెల్లడించారు.

- **మామిడి:** దీనికి ఏడున్నర మీటర్ల పొడవు, వెడల్పుతో సాగు చేస్తే రెండేళ్లకు హెక్టారుకు రూ.50వేలు, ఐదున్నర మీటర్ల పొడవు, వెడల్పుతో సాగుచేస్తే రూ.80వేలు ప్రభుత్వం అందిస్తోంది.
- **జీడిమామిడి:** పొడవు, వెడల్పు ఆరు మీటర్లు ఉండేలా సాగుచేస్తే రెండేళ్లకు హెక్టారుకు రూ.30వేలు. పొడవు, వెడల్పు ఐదు మీటర్లతో సాగుచేస్తే రూ.60వేలు అందిస్తోంది.
- **ఆయిల్‌పామ్:** 9మీటర్లపొడవు,వెడల్పు ఉండేలా సాగుచేస్తే మొక్కలు, ఎరువుకు నాలుగేళ్లపాటు హెక్టారుకు రూ.71వేలు ఇస్తారు.
- **కోకో:** కొబ్బరిలేదా ఆయిల్‌పామ్ సాగులో అంతర్ పంటగా కోకో సాగు చేసే రైతులకు రెండేళ్లకు హెక్టారుకు రూ.30వేలు ఇస్తారు.
- **జామ:** పొడవు వెడల్పు, మూడు మీటర్లు సాగు చేస్తే రెండేళ్లకు హెక్టారుకు రూ.80వేలు అందిస్తారు.
- **నిమ్మ, బత్తాయి:** పొడవు, వెడల్పు ఆరు మీటర్లు ఉండేలా సాగు చేస్తే హెక్టారుకు రెండేళ్లకు రూ.50వేలు అందిస్తారు.
- **డ్రాగన్‌ఫ్రూట్:** పొడవు, వెడల్పు 3 మీటర్లు ఉండేలా సాగు చేస్తే హెక్టారుకు రూ.2.70లక్షలు రాయితీ అందిస్తారు.
- **స్ప్రేయర్లు:** ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు రూ.10వేలు, మిగిలిన వారికి రూ.8వేలు రాయితీ అందిస్తారు. మల్చింగ్ షీటుకు హెక్టారుకు రూ.16వేలు, షెడ్డు నెట్‌కు 50శాతం సబ్సిడీ మామిడి, అరటి పండ్ల కవర్లకు హెక్టారుకు రూ.25వేలు అందిస్తోంది.
- **యంత్ర పరికరాలకు..:** చిన్నట్రాక్టరు ధర రూ.4లక్షలు. ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ, మిగిలిన రైతులకు రూ.1.60లక్షలు సబ్సిడీతో ఇస్తోంది.
- **పుట్టగొడుగులు:** రూ.30లక్షలు విలువ చేసే పుట్టగొడుగుల తయారీ యూనిట్‌కు రాయితీ రూ.12లక్షల మేర సబ్సిడీ అందిస్తోంది.
- జీడి, కోకో శుద్ధి చేసే యూనిట్ ధర రూ.35లక్షలు కాగా రూ.12.25లక్షలు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది.

విదేశాల్లో విద్య, ఉద్యోగ అవకాశాలు



కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విదేశాల్లో విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు కాకినాడ జిల్లా ఇన్చార్జి అధికారి వీడీజీ మురళి తెలిపారు. ఖతర్ దేశంలోని దోహ నగరంలో హోమ్ కేర్ నర్స్ (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాల కోసం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గలవారు బీఎస్సీ లేదా జీఎన్ఎం నర్సింగ్ విద్యార్హతలతోపాటు కనీసం రెండు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.1.20 లక్షల వరకు టాక్స్ ఫ్రీ వేతనం, అదనంగా ఉచిత వసతి, వైద్య సేవలు, రవాణా సదుపాయాలు లభిస్తాయి. ఈ నెల 13వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

- జర్మనీ దేశంలో ఫిజియోథెరపీ, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ ఉద్యోగాలకు అవకాశాలున్నాయి. బీపీటీ, డిప్లొమా లేదా డిగ్రీ ఇన్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులు. ఫ్రెషర్స్‌కి నెలకు రూ.2,500 నుంచి రూ.3 వేల యూరోలు(రూ.3,10,350) వేతనం లభిస్తుంది. ఎంపికైన వారు జర్మన్ భాషా శిక్షణ పొందవలసి ఉంటుంది. ఇందుకు రూ.లక్ష ఫీజు చెల్లించాలి. వయసు 18-40 సంవత్సరాల మధ్య గల అభ్యర్థులు అర్హులు. ఈ నెల 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- రష్యా దేశంలోని మెటలర్జికల్ కాలేజీలో మెటలర్జీ డిప్లొమా కోర్సు కోసం పూర్తి స్థాయి స్కాలర్‌షిప్ (ట్యూషన్ ఫీ+వసతి ఉచితం) అందుబాటులో ఉంది. కోర్సు వ్యవధి 3 సంవత్సరాల 6 నెలలు. క్యాంపస్‌లో ఫుల్‌టైమ్ విధానంలో క్లాసులు ఉంటాయి.ఐటీఐ, ఇంటర్మీడియట్ (ఎంపీసీ), వృత్తిపరమైన లేదా ఒకేషనల్ కోర్సులు చదివిన వారు అర్హులు. వయసు 18 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉండి, ఇంగ్లీష్‌లో కనీసం 75 మార్కులు సాధించి ఉండాలి. ఈ నెల 13వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆసక్తి గల వారు పాస్‌పోర్ట్, విద్య ధ్రువపత్రాలు, అవసరమైన పత్రాలతో https://naipunya m.ap.gov.in/user-registration?page=programcregistration వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 99888 53335, 87126 55686, 99592 20422, 85008 85866 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఇన్చార్జి అధికారి మురళి పేర్కొన్నారు.

రేపు పిఠాపురానికి డిప్యూటీ సీఎం పవన్



పిఠాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ నెల 9వ తేదీన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి అధికారిక సమాచారం రావాల్సి ఉంది. బుధవారం ఆయన కొత్తపల్లి మండలం అమీనాబాద్ హెలికాప్టర్‌లో చేరుకుని అక్కడ మత్స్యకారులతో సమావేశం కానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ నగిలి షాన్‌మోహన్ మంగళవారం రాత్రి అధికారులతో సమీక్షించారు. ఉప్పాడ హార్బర్, తొండంగి మండలంలో ఎక్కడ హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలనే అంశంపై పరిశీలన జరిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎంపీడీవోల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు


ఎంపీడీవోలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించి మంచి అధికారిగా పేరు తెచ్చుకోవచ్చని కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కేఎన్వీ ప్రసాదరావు పేర్కొన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో నెల రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న రెండో బ్యాచ్ ఎంపీడీవోల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం మంగళవారం సాయంత్రం వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసాదరావు మాట్లాడుతూ శిక్షణను ఒక మంచి అవకాశంగా భావించి కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. అన్ని స్థాయిల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని పంచాయతీరాజ్ ప్రతిష్ఠ పెంచాలని చెప్పారు.ఈ సందర్భంగా శిక్షణను పూర్తిచేసుకున్న ఎంపీడీవోలు ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాళ్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్. శర్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో రిషిత్‌కు కాంస్యం



కాకినాడ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఇటీవల జరిగిన సీబీఎస్ఈ జాతీయ ఫెన్సింగ్ చాం పియన్‌షిప్‌లో సెబర్ సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో కాకినాడ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థి నల్లమిల్లి శేషు రిషిత్‌రెడ్డి కాంస్య పతకం సాధించినట్టు స్కూలు అధినేత ఎస్.సుగుణారెడ్డి తెలిపారు. ఫెన్సింగ్ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజీవ్‌మెహతా మాట్లాడుతూ సీబీఎస్ఈ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో మొదటిసారిగా ఆంధ్ర నుంచి క్రీడాకారులు మంచి పోటీ ఇచ్చారన్నారు. పతకం సాధించిన శేషరిషిత్‌ను, ప్రిన్సిపాల్ వందనా బొహరాను, శిక్షకులు సతీష్, బేబీరెడ్డిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఎస్.సుగుణారెడ్డి అభినందించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌తో అనపర్తి ఎమ్మెల్యే భేటీ


బుచ్చిరామ్‌ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరామ్‌ప్రసాద్‌తో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భేటీ అయ్యారు. అనపర్తి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి, సంక్షేమంపై ఆయన ప్రత్యేకంగా చర్చించారు. అనపర్తి నియోజకవర్గంలో ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వివిధ ఆలయాల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సత్యదేవుడికి దేవదాయ కమిషనర్ పూజలు


పశ్చిమ రాజగోపురం వద్ద నిర్మిస్తున్న షెడ్డును పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

అన్నవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. విజయనగరం పైడితల్లి సిరిమాను ఉత్సవంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన మార్గమధ్యంలో ఉన్న స్వామిసన్నిధికి సోమవారం రాత్రి చేరుకుని బసచేసి మంగళవారం ఉదయం ప్రారంభ సమయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పశ్చిమ రాజగోపురం వద్ద దాత సహకారంతో నిర్మిస్తున్న షెడ్డును, ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఫ్యాన్సీ షాపు గొడౌన్‌ను పరిశీలించారు. ఆయన వెంట అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తదితరులున్నారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి హోమాలు, జపాలు, పారాయణలు నిర్వహించారు. 11గంటలకు హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి జరిపారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చుక్కల జింక ప్రాణాలు కాపాడిన వైద్యులు

- అడవి నుంచి మైదాన ప్రాంతానికి వచ్చి కుక్కల దాడిలో గాయపడిన వన్యప్రాణి
- ప్రత్తిపాడులో వైద్య సేవలు


ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో జింకకు చికిత్స చేస్తున్న వైద్యుల బృందం

ప్రత్తిపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అడవి నుంచి ఆహారం కోసం మైదాన ప్రాంతానికి వచ్చిన వన్యప్రాణి చుక్కల జింకపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన జింకకు మంగళవారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు పశువైద్యులు సకాలంలో చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యం అటవీ ప్రాంతం నుంచి చుక్కల జింక ఆహారం కోసం పెద్దాపురం మండలం ఆనూరు గ్రామానికి చేరుకుంది. అయితే అక్కడ కుక్కలు దాడి చేయడంతో స్థానికులు జిల్లా అటవీశాఖాధికారి ఎం.రామచంద్రరావుకు సమాచారం అందించారు.దీంతో ఏలేశ్వరం ఫారెస్ట్ అధికారులు తీవ్రంగా గాయపడిన చుక్కల జింకను మంగళవారం ప్రత్తిపాడు ఏరియా వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్. బాలచంద్ర యోగేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలందించారు. సకాలంలో వైద్యం అందించడంతో కోలుకున్న చుక్కల జింకను ఏలేశ్వరం అటవీశాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం లింగంపర్తి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో వదిలివేశారు.

10 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు బంద్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ నెట్ వర్క్ ఆసుపత్రులలో వైద్యసేవలను బంద్ చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ప్రకటించింది. ఈమేరకు రాజమహేంద్రవరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసుపత్రులకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ నుంచి రావాల్సిన బకాయిలు సుమారు రూ.2,700 కోట్లు పైమాటే ఉన్నాయని, ఇంకా ఏ నెలకు ఆ నెల బకాయిలు పెరుగుతూనే ఉన్నాయే తప్ప క్లియర్ కావడంలేదని తెలిపింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బతుకు భారమైందని పేర్కొంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి అసెంబ్లీలో నెట్ వర్క్ ఆసుపత్రుల బకాయిలపై ప్రకటించారే తప్ప చేతల్లో ఫలితం కనిపించడంలేదని, ఈ తరుణంలో గత నెల 24న సమావేశమైన ఆషా రాష్ట్ర కార్యవర్గం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించిందని, దానికి అనుగుణంగానే ఈనెల 10 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద వైద్యసేవలను నిలిపివేయాలని నెట్ వర్క్‌ఆసుపత్రులు నిర్ణయించాయిని ఆషా పేర్కొంది. ఇప్పటికే మంత్రులకు, ఎంపీ, ఎమ్మెల్యేలకు, కలెక్టర్లను కలిసి తమ ఆవేదన విన్నవిస్తూనే ఉన్నామని ఈ నెల 10వ తేదీ లోగా సమస్యకు పరిష్కారం లభించకపోతే ఎన్టీఆర్ వైద్యసేవలు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించినట్టు ఆషా ప్రకటించింది. ఏడాది కాలంగా తాము పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రజలంతా అర్థం చేసుకుంటారని భావిస్తున్నామని తెలిపింది.

'క్రమశిక్షణతో ఉండాలి'

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి క్రమశిక్షణ, సహనం కచ్చితంగా ఉండాల్సిన లక్షణాలని, వాటిని అలవర్చుకొంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని ఆమె సందర్శించి వసతులను పరిశీలించారు.బాలలతో మాట్లాడి బాగోగులపై ఆరా తీశారు. మంచి, చెడు స్పర్శల గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైతే డీఎల్ఎస్ఏని సంప్రదించాలని సూచించారు.

ధీరూభాయ్ అంబానీ క్విజ్‌కి దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 30 వరకూ గడువు.. తూర్పుగోదావరి జిల్లా విద్యాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తమ కేజీడీ-6 విభాగం ద్వారా సామాజిక కార్యక్రమాల్లో భాగంగా గత 13ఏళ్లుగా రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా విద్యాధికారి వాసుదేవరావు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాదికి సంబంధించి ఈ నెల 30వరకూ దరఖాస్తులను స్వీకరిస్తున్నారన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో మంగళవారం క్విజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జట్టుకు ఇద్దరు చొప్పున ప్రతి పాఠశాల నుంచి రెండు జట్లు పాల్గొనవచ్చన్నారు. జిల్లాకు సంబంధించి డిసెంబరు 2న రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో పోటీలు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 0884-3577222, 63022 23156 నెంబర్లలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 99599 88835లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఓఎన్జీసీ గ్యాస్ పైపులైన్ పేలుడు.. నష్టం అంచనాకు బృందం నియామకం

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల, మాజీ మంత్రి మల్లాడి

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): యానాం సమీపంలోని దరియాల తిప్ప వద్ద ఆగస్టు 22న ఓఎన్జీసీ గ్యాస్ పైపులైన్ పేలడం వల్ల జరిగిన నష్టాన్ని శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేయడానికి బృందాన్ని నియమించామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మత్స్యశాఖ అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పేలుడు ఘటనతో మత్స్య సంపదకు ఎంతవరకు నష్టం జరిగింది, మత్స్యకారుల జీవన భృతికి ఏ విధంగా ఆటంకం ఏర్పడింది అనే విషయాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ నష్టాన్ని అంచనా వేయడానికి సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (విశాఖపట్నం)కు చెందిన డాక్టర్ జో నేతృత్వంలో అధ్యయన బృందాన్ని నియమించారన్నారు. పేలుడు సంభవించిన ప్రాంతానికి చుట్టు పక్కల ఉన్న గ్రామాలను, ఎక్కువ నష్టం జరిగిన కోర్ గ్రామాలను, ఫెర్రీ ఫ్రీ గ్రామాలను నిర్ధారించాలని బృందాన్ని కోరామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించాలని కోరామన్నారు. సముద్రం, నది, నది ముఖద్వారాల వద్ద బోట్లు తిరగడానికి ఆటంకంగా ఉన్న ఇసుక మేటలను తొలగించాలన్నారు. తుది రిపోర్టును వారంలో ఇవ్వాలని బృందాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ డాక్టర్ అంజలి, జిల్లా మత్స్య శాఖ అధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

కూటమి వర్సెస్ వైసీపీ

(ఐదో పేజీ తరువాయి)

అంశంపై చర్చలో అధికారులు మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో 4.79 లక్షల ఎకరాల్లో రైతులు పంట సాగు చేపట్టగా ఇప్పటి వరకు 60 టీఎంసీల నీరు విడుదల చేశామన్నారు. నాణ్యత లేని విత్తనాల కారణంగా పిఠాపురం నియోజకవర్గంలో పత్తి సాగు చేసిన రైతులు నష్టపోతున్న విషయాన్ని సభ్యులు ప్రస్తావించగా లామ్, డాట్ సెంటర్ల శాస్త్రవేత్తల బృందం నివేదిక ఆధారంగా రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపడతామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సమాధానమిచ్చారు. వైద్యఆరోగ్యం సమీక్షలో సభ్యులు మాట్లాడుతూ ఇటీవల తుని ఏరియా ఆసుపత్రిలో ప్రసవించిన మహిళ మృతి ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తొండంగి జడ్పీటీసీ కోరగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఘటనపై కాకినాడ జీజీహెచ్ వైద్యులతో విచారణ జరిపిస్తున్నామని బదులిచ్చారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆల మూరు మండలం లంక భూముల్లో మట్టిని ఇటుక బట్టీలకు లోతుగా తవ్వేస్తున్నందున కూరగాయల పంట సాగు కనుమరుగవుతోందని, దీన్ని నియంత్రించాలని అధికారులకు సూచించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాలను అమలాపురం ఇరిగేషన్ డివిజన్ పరిధి నుంచి హెడ్‌వర్క్స్ డివిజన్ పరిధిలోకి మార్చాలన్నారు. వర్షాధారంపై పంటలు సాగు చేసే ఏజెన్సీ ప్రాంత రైతులకు సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏజెన్సీ మండలాల ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రతి 3నెలలకొకసారి ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు నిర్వహించాలని కోరగా అందుకు పీవో అంగీకరించారు. ఏజెన్సీ మండలాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ పాటించాలని జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్

జీఎస్టీ తీర్మానంపై చర్చ


జీఎస్టీ జీఎస్టీ తగ్గించడంపై ప్రధాని మోదీ, జీఎస్టీ మండలికి అభినందనలు తెలపాలి అంటూ అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించగా.. దానికి సభ్యులు వ్యతిరేకతపై వాడీవేడిగా చర్చసాగింది. దీనిపై ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మధ్య చాలా సేపు వాదోపవాదాలు జరిగాయి. తీర్మానం చేయలేదు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌దాట్ల బుచ్చిరాజు, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, రంపచోడవరం ఐటీడీఏ పీఓ బి.స్మరన్‌రాజు, తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో టి.సీతారామమూర్తి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో కె.మాధవి, జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, జడ్పీ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఒక ప్రమాదం.. రెండు కుటుంబాల్లో విషాదం

రెండు మోటారుసైకిళ్లు ఢీకొని ఇద్దరి మృతి

నరేంద్రపురం-నందరాడ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై సంఘటన





సంఘటనా స్థలంలో మృతదేహాలు



మోటార్ సైకిల్

రాజానగరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం-నందరాడ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజానగరంలోని సుబ్బారావు కాలనీకి చెందిన బుదిరెడ్డి సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు (32) జట్టు కూలీగా పని చేస్తున్నాడు. భార్య మంగ ఆశా వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సత్తిబాబు, మంగ రాజానగరంలోని ఒక దుకాణంలో పని చేసిన సమయంలో ఏర్పడిన పరిచయంతో పదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్తిబాబు మోటార్‌సైకిల్‌పై కోరుకొండ వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో నందరాడ దాటిన తర్వాత మలుపులో మరో మోటార్‌సైకిల్‌పై ఎదురుగా వస్తున్న కొవ్వూరుకు చెందిన మెర్ల శ్రీనివాస్ (45) ప్రమాదవశాత్తూ బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరి తలలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరి కుటుంబాల్లో ఇంటి యజమానులు మరణించడంతో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ సీజ్

రాజానగరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా నుంచి కాకినాడకు ఐషర్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మార్గమధ్యంలో రాజానగరం హైవేపై పట్టుకున్నట్టు రాజానగరం సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఏపీ 39-యుకె 4427 నెంబరు కలిగిన ఐషర్ వ్యాన్‌లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని డ్రైవర్‌ను విచారించగా కృష్ణా జిల్లా ఉయ్యూరు పట్నం నుంచి కాకినాడ జిల్లా పిఠాపురానికి తరలిస్తున్నట్టు చెప్పాడన్నారు. గొల్లప్రోలుకు చెందిన గారపాటి రాజు వాహన యజమాని అని భోగాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ కోరసిక విజయ్ చెప్పాడన్నారు. వాహనంలో సీమ్మార్ గోనె సంచుల్లో 13,750 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. డ్రైవర్ వద్ద ఏవిధమైన రికార్డులు లేవని, బియ్యంతో సహా వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.. బియ్యం విలువ రూ.6,32,500గా నిర్ధారించామన్నారు. వ్యాన్‌ను రాజానగరం పోలీసులకు అప్పగించినట్టు బాపిరాజు తెలిపారు.

అశ్లీల నృత్యాలపై దాడి

ఐదుగురిపై కేసు

కోటనందూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కేఈ చిన్నాయిపాలెం గ్రామంలో దసరా సందర్భంగా నిర్వహించిన అశ్లీల నృత్యాలు (రికార్డింగ్ డాన్స్)పై కోటనందూరు పోలీసులు దాడి చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కేఈ చిన్నాయిపాలెంలో 2 వాహనాలపై హిజ్రాలతో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తున్నట్టు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు వచ్చిన సమాచారం రావడంతో దాడి చేశారు. హిజ్రాలతో పాటు గ్రామస్తులు పారిపోయారు. 2 వాహనాలను సీజ్ చేసి ఉత్సవ కమిటీ సభ్యులైన లాలం అచ్యూతానంద(బాబ్జీ), కరక నాగేశ్వరరావు, లాలం వెంకినాయుడు, లాలం నగేష్, లెక్కల అప్పలనాయుడిపై కేసు నమోదు చేసినట్టు సీఐ చెన్నకేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ కృష్ణామాచారి సిబ్బంది ఉన్నారు.

మద్యం మత్తులో హత్య...

తునిలో యువకుడి హత్య కేసులో నిందితులను పట్టుకున్న పోలీసులు

వివరాలు వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

పెద్దాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సీపట్నం బస్టాండ్ వద్ద ఈనెల 2న జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు చేధించారు. పెద్దాపురం డీఎస్పీ కార్యాలయంలో హత్యకు దారితీసిన కారణాలను డీఎస్పీ డి.శ్రీహరిరాజు మీడియాకు మంగళవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే... ఈనెల 2న నర్సీపట్నం బస్టాండ్ వద్ద గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన బొడ్డు సురేష్, పాయకరావుపేటకు చెందిన తార ప్రసాద్ మద్యం తాగుతూ ఉండగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం యరకంపాలెం గ్రామానికి చెందిన తానారి అప్పలనాయుడు (37) మద్యం మత్తులో బస్‌స్టాండ్‌కి వచ్చాడు. సమీపంలో మద్యం తాగుతున్న సురేష్, ప్రసాద్‌తో మాట్లాడుతూ వారిపై పడడంతో అప్పలనాయుడిని కిందకు తోసేశారు. అప్పలనాయుడు జేబులో నుంచి సెల్‌ఫోను, నగదు బయటపడడంతో లాక్కునేందుకు ప్రయత్నించారు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో బ్రిడ్జి కింద రేకుల షెడ్డు వద్ద అప్పలనాయుడు పడిపోవడంతో ప్రసాద్, సురేష్ ఇద్దరు పక్కన ఉన్న రాయి, ఇనుప రాడ్డుతో అప్పలనాయుడు ముఖంపై విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో అప్పలనాయుడు మృతిచెందాడు. అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.500 నగదును తీసుకుని ఇనుపరాడ్డును సమీపంలో తుప్పల్లో పారవేసి పరారయ్యారు. దీంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను పట్టుకున్నారు. అలాగే హత్యకు ఉపయోగించిన రాడ్డు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐలు చెన్నకేశవరావు, గీత రామకృష్ణ ఎస్ఐలు కృష్ణమాచారి, జగన్మోహన్, విజయ్ బాబులను జిల్లా ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు.

ప్రత్తిపాడులో పాము కాట్లు

ఒకేరోజు వేర్వేరు చోట్ల నలుగురిని కాటేసిన సర్పాలు

ప్రతిపాడు ఆసుపత్రిలో బాధితులు





ప్రత్తిపాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రత్తిపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో మంగళవారం వేర్వేరు చోట్ల నలుగురు వ్యక్తులు పాము కాట్లకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో శరభవరం గ్రామానికి చెందిన కుట్టు మిషన్ కార్మికుడు గొణగాల నరసింహమూర్తి మంగళవారం సాయంత్రం మిషన్ వద్ద పనిచేస్తుండగా తాచుపాము కాటు వేసింది. దీంతో స్పృహ కోల్పోయిన అతడిని వెంటనే కుటుంబ సభ్యులు ప్రతిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అలాగే గజ్జనపూడి, పెద్ద శంకర్లపూడి గ్రామాలకు చెందిన రైతులు బొబ్బిలి వీరబాబు, పి.వీరవెంకట సత్యనారాయణ సాయంత్రం పొలం పనుల్లో పాముకాట్లకు గురయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి బంధువులు తరలించారు. అలాగే ఎర్రవరం గ్రామానికి చెందిన పి.వీరబాబు పొలంలో నుంచి వస్తుండగా కట్లపామును గమనించకుండా తొక్కేశాడు. దీంతో పాటు కాటు వేసింది. కంగారుతో కేకలు వేయడంతో స్థానికులు కట్ల పామును చంపేసి బాధితుడిని మంగళవారం రాత్రి 9 గంటలకు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నలుగురికి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య మైకేల్, సిబ్బంది వైద్యం అందిస్తున్నారు. ఒక్కొక్కరికి 20 యాంటీ వైనల్స్ ఇంజక్షన్‌లు ఇచ్చామని, ప్రాణాలు కాపాడడానికి రాత్రంతా చికిత్స అందించనున్నామని సౌమ్య మైకేల్ తెలిపారు.

కొవ్వాడలో పట్టపగలే చోరీ

50 కాసుల బంగారం అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ఎస్ఐ

కాకినాడ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలోని ప్రధాన కూడలి సమీపంలోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. సుమారు 50 కాసుల బంగారం అపహరణకు గురైంది. ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఇంటి యజమాని మక్కా చిన్నారావు కిర్లంపూడి ఎంఈవోగా, ఆయన భార్య మాధవపట్నం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటల తర్వాత దంపతులిద్దరూ ఇంటి గేటుకి, ప్రధాన ద్వారానికి తాళాలు వేసుకుని ఉద్యోగాలకు వెళ్లారు. సాయంత్రం 5గంటలకు చిన్నారావు ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు బద్దలుగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో కంగారుపడి చోరీ జరిగినట్టు ఇంద్రపాలెం పోలీసులకు సమాచారమిచ్చారు. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, క్లూస్ టీం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించింది. చిన్నారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులపై దాడి కేసులో నలుగురి అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మండపేట రూరల్ సీఐ దొర్రాజు

రాయవరం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులపై దాడికి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్టు మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు తెలిపారు. మంగళవారం రాయవరం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాచవరం వంతెన వద్ద సోమవారం తెల్లవారుజామున ఆటో కోసం వేచి చూస్తున్న అనుసూరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సోమేశ్వరానికి చెందిన శాఖ వంశీ అతడి స్నేహితులు ముగ్గురు కలిసి కామెంట్ చేశారు. అదే సమయంలో ఆటో డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణ అక్కడకు చేరుకుని శ్రీనివాస్ బంధువులను ఆటోలో ఎక్కించుకుని వారి స్వగ్రామం వెదురుపాకసావరం వైపు బయలుదేరగా సోమేశ్వరం శివాలయం వద్దకు వచ్చేసరికి శాఖ వంశీ అతడి మిత్రులు కారులో ఆటోకు అడ్డుతగిలి ఆటోలో ఉన్న ప్రయాణికులను చంపేస్తామని బెదిరించి డ్రైవర్‌పై దాడి చేశారు. అతడి సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు ఎందుకు దాడి చేస్తున్నారని ప్రశ్నించగా వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వెళ్లారు. ఆసుపత్రి నుంచి పోలీసులకు వచ్చిన ఫిర్యాదుపై బాధితుల నుంచి వివరాలను సేకరించి రాయవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ హరిశ్‌కూమార్ నేతృత్వంలో కేసులో నిందితులైన శాఖ విన య్‌వంశీ (సోమేశ్వరం), మాచవరపు వెంకటసాయిగణేష్ (వెదురుమూడి), రిమ్మల పూడి సాయి (వల్లూరు), పర్వతిని వౌళి సాయి (పులగుర్త)ను మంగళవారం మధ్యాహ్నం మాచవరం పాత పెట్రోలు బంకు వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు. కేసులో నిందితులను వేగంగా పట్టుకున్న పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారని సీఐ చెప్పారు. సమావేశంలో రాయవరం ఇన్‌చార్జి ఎస్ఐ హరిశ్ తదితరులు ఉన్నారు.

గోదావరిలో దూకిన యువకుడి మృతదేహం లభ్యం

మలికిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో కుటుంబ సభ్యులు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లమని ఒత్తిడి చేస్తుండడంతో గోదావరిలోకి దూకిన యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మలికిపురం ఎస్ఐ బి.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వుయ్యూరివారి మెరకకు చెందిన మేడిద సుదర్శనరాజు (25) రష్యా వెళ్లేందుకు రూ.లక్షా 50వేల జీతంతో ఉద్యోగం వచ్చింది. నాన్నమ్మతో పాటు ఇంట్లో వారు వెళ్లమని ఒత్తిడి చేస్తున్నారు. మద్యానికి బానిసైన సుదర్శనరాజు భార్య, కుమార్తెను వదిలి వెళ్లడం ఇష్టం లేక విదేశాలకు వెళ్లనని ఈనెల 5న ఆదివారం దిండి-చించినాడ వంతెనపైకి వచ్చాడు. అప్పటికే మద్యం తాగి అతడు భార్యతో ఫోన్‌లో మాట్లాడుతూ వంతెనపై నుంచి గోదావరిలోకి దూకేశాడు. యువకుడి మృతదేహం మంగళవారం అంతర్వేది-గొంది నదీ తీరంలో లభించినట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు తెలిపారు.

వాగులో మునిగి పశువుల కాపరి మృతి



మృతి చెందిన ప్రసాద్

ఎటపాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పశువులను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పశువుల కాపరి వాగులోని వరదనీటిలో మునిగి మృతిచెందిన ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం తోటపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తోటపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి నక్కా ప్రసాద్ (48) మరో పశువుల కాపరితో కలిసి పశువులను మేపడానికి తోటపల్లి వాగు పరివాహక ప్రాంతం వైపు వెళ్లారు. ఈ క్రమంలో మందలోని కొన్ని పశువులు వాగు దాటి అవలి ఒడ్డు వైపు వెళ్లాలి. దీంతో ప్రసాద్ ఆ పశువుల కోసం వాగు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో మునిగిపోయాడు. అనంతరం కొద్దిసేపటి తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు.

బస్సు ఆపమని... కాలువలోకి దూకిన ఇంటర్ విద్యార్థిని

పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం గాలింపు

లభ్యం కాని ఆచూకీ

ఉండ్రాజవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని మోర్త గ్రామానికి చెందిన జూనియర్ ఇంటర్ విద్యార్థిని మంగళవారం సాయంత్రం దమ్మెన్ను కాలువలోకి దూకింది. గ్రామానికి చెందిన కొప్పుల పూజిత మండలంలోని ఓ ప్రయివేటు జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఉదయం యథావిధిగా కాలేజీకి వెళ్లి తిరిగి బస్సులో సాయంత్రం ఇంటికి వస్తుండగా దమ్మెన్ను కాలువ వంతెనపైకి రాగానే తనకు వాంతులు అవుతున్నాయని, బస్సును ఆపమని చెప్పి దిగిన వెంటనే ఒక్కసారిగా వంతెనపై నుంచి కాలువలోకి దూకేసింది. దీంతో తోటి విద్యార్థి తమ కళ్లెదుటే కాలువలోకి దూకేయడంతో విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే స్థానికులు రక్షిద్దామని ప్రయత్నించినప్పటికీ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొట్టుకుపోయింది. సంఘటన తెలిసిన వెంటనే ఉండ్రాజవరం పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం గాలింపు చేపట్టారు. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈమె తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, సుబ్బలక్ష్మి విడాకులు తీసుకుని వేర్వేరుగా తీసుకుని జీవిస్తున్నారు. పూజితకు అక్క, అన్నయ్య ఉన్నారు. అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి చదువుకుంటోంది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ తిలక్ పరిశీలించారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'మామిడి, జీడి మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి'

పెద్దాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మామిడి, జీడి మామిడి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని శాస్త్రవేత్త డాక్టర్ సునీత పేర్కొన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో ఉద్యానవన శాఖాధికారిణి కటకం సత్య శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బిందు, తుంపర్ల సేద్యం పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.



కాకినాడలో జరిగిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడలో జీఎస్టీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు



సామర్లకోట: విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న విద్యా శాఖాధికారులు

జీఎస్టీ తగ్గింపు... పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి... జిల్లా అంతటా అవగాహన సదస్సులు

కాకినాడ సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాలకు కూటమి ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మెయిన్‌రోడ్డులో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు ధరల వ్యత్యాసం కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గ్రంధి నారాయణరావు, బచ్చు శేఖర్, గదుల సాయిబాబు, చింతలపూడి రవి, దంగేటి సతీష్, పంతాడి రాజు, నల్లూరి శ్రీనివాస్, అమన్ జైన్, అమలకంటి బలరాం, రెడ్నం సత్తిబాబు, ఏవీడీ మెంటారావు, అదేపల్లి గంగరాజు, బంగారు సత్యనారాయణ, మేడిశెట్టి చిన్ని, పల్లా సురేష్, పాలిక నాని, కోడూరి పెద్ద, పసుపులేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన కాకినాడలో అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణరెడ్డి ఏఏ రంగాల్లో ఎంత ప్రయోజనం కలిగిందో సోదాహరణంగా వివరించారు. విశిష్ట అతిథిగా సంఘటన కార్యదర్శి మధుకర్‌జీ హాజరయ్యారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అనపర్తి కళ్యాణి ఏఏ వస్తువులు ఎంత శాతం తగ్గాయో వివరించారు. జీఎస్టీ 2.0పై వర్తక సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యానారాయణరాజు, భావనప్రసాద్, జీఎస్టీ ఇన్చార్జి కుండల సాయికుమార్ యాదవ్, దాట్ల కృష్ణవర్మ, చోడిశెట్టి రమేష్‌బాబు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, గట్టి సత్యనారాయణ, ముత్తా నవీన్, యార్లగడ్డ రామ్‌కుమార్, సురేష్, రాజేష్, రవీంద్ర, చిన్న, హరి, ట్రేడర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గ్రంధి బాబ్జీ, మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి, అధిక సంఖ్యలో వ్యాపారులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కేంద్రం తగ్గించిన జీఎస్టీ ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి తెలిపారు. ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ ఇంటర్ విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. ఇంటింటా జీఎస్టీ ఫలాల పేరుతో నిత్యావసర సరుకులు, మందులు, స్టేషనరీ, వస్త్రాలు, క్రీడా పరికరాలు, రవాణా తదితర వాటిపై పన్నులు తగ్గాయని ప్రజలకు అర్థమయ్యేలా ఈ నెల 18వ తేదీ వరకు ప్రచారం చేస్తామన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమాలకు చెందిన వాటిపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపు ఇచ్చామన్నారు. వ్యాసరచన పోటీని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఉప కమిషనర్ తోట లలిత, ఏసీటీవోలు అనిశెట్టి వీవీ స్వామి, ఎ.సత్యశ్రీనివాస్, హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగల పుల్లయ్య ఆధ్వర్యంలో హెచ్ఎంల పర్యవేక్షణలో జీఎస్టీపై చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో విజేతలను ఎంపిక చేసి వారిలో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విజేతలకు మండల స్థాయిలో బహుమతులను వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీవిద్య, ఎంపీడీవో భైరవమూర్తి అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కూర్మారావు, పుష్పరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే లాభాలను దుకాణదారులు, ప్రజలకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, అధ్యాపకులు శ్రీనివాసరావు, వీజీ ఆంజనేయులు, పద్మావతి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ అవగాహన కల్పించారు. జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయంగా మిగిలిపోతాయన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జీవీ శేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎండీఎంకే షావలి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): పీఆర్ ప్రభుత్వ, వృత్తి విద్యా జూనియర్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో డీఐఈవో ఐ.శారద అధ్యక్షతన విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కల్పించినట్టు పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు తెలిపారు. విద్యార్థులకు జీఎస్టీపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు పిల్లి శివప్రసాద్, నిరంజన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కాకినాడ ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో అవగాహన కల్పిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు 'భాష్యం' విద్యార్థుల ఎంపిక

పిఠాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు భాష్యం స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన రగ్బీ పోటీల్లో అండర్-14 కేటగిరీలో బి.జస్వంత్, అండర్-17 కేటగిరీలో ఎన్.పెద్దిరాజు ప్రతిభ చూపారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీఈటీ కృష్ణార్జున, కోచ్ పి.లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ, విద్యార్థులను భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు అభినందించారు.

'ఉన్నతి' ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ

కాకినాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులకు వృత్తి శిక్షణ అందించే లక్ష్యంతో ఉన్నతి ఫౌండేషన్ కెప్టెన్ సుబ్బారావు ప్రభల సహకారంతో కాకినాడలో కొత్త కేంద్రాన్ని ప్రారంభించింది. తూరంగిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌స్వామి మాట్లాడుతూ తమ సంస్థ యూనెక్స్ శిక్షణ కూడా ఇస్తోందన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన వృత్తి శిక్షణ కేంద్రం, యూనెక్స్ మోడల్‌తో కలిపి ప్రతి సంవత్సరం కాకినాడలో 2000 మందికిపైగా యువతకు నైపుణ్య, వృత్తి శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.



కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు

'మహారాజా ఆశయాలను కొనసాగిస్తాం'

పిఠాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మహారాజా ఆశయాలను కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని సంస్థానం సత్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అంతకు ముందు మహారాజా రాజా రావు వెంకట మహీపతి సూర్యారావు బహద్దూర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థానం సత్రం ఈవో శివబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్, పండ్ల తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయిల్‌పామ్ తోటల్లో గుమ్మోసిస్ వ్యాధి, నివారణ పద్ధతులపై డెమో ద్వారా అంబాజీపేట హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.అశోక్ వివరించారు. పిఠాపురం ఉద్యానవన శాఖాధికారి వై.సోమశేఖర్, పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ్మవరంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి ప్రారంభించారు. పశువైద్యులు కొండలరావు, అంబేద్కర్, సురేష్‌బాబు, కల్యాణి, ఎం.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో 46 గేదెలు, 28 ఆవులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బి.కొత్తూరులో ఉద్రిక్తత

పోలీసు పికెట్ ఏర్పాటు

పిఠాపురం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.కొత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో బాలుర మధ్య బెట్టింగ్ విషయంపై సోమవారం రాత్రి వివాదం జరిగింది. ఇది ఘర్షణకు దారితీసింది. గతంలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ, తదనంతర పరిణామాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ, రూరల్ ఎస్ఐలు మణికుమార్, జానీబాషా పర్యటించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పిఠాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం రాత్రి పోలీసులు గుర్తించారు. ఇతని వయసు 35-40 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు. పింక్ కలర్ షర్ట్, బ్లూ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందని, వివరాలు తెలియాల్సి ఉందని పట్టణ ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

'చివరి ఆయకట్టు వరకు సాగునీరు'



సమావేశంలో పాల్గొన్న గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్

పిఠాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అన్ని చర్యలు తీసుకున్నామని గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. పిఠాపురంలోని ఇరిగేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీబీసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ-1 సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, ఎఫ్‌డీఆర్, కాంక్రీట్ వర్క్స్ తదితర అంశాలపై చర్చించారు. రబీకి పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలని తీర్మానించారు. పీబీసీ డీఈఈ సంతోష్‌కుమార్, నీటి సంఘాల అధ్యక్షులు తలారి త్రిమూర్తులు (కొత్తపల్లి), బసవా సత్తిబాబు (చిత్రాడ), మునిరెడ్డి రాంబాబు (సామర్లకోట), దమ్మాల శ్రీనివాసరావు (తిమ్మాపురం), నాగిశెట్టి అమ్మిరాజు (పండూరు), తోట ప్రసాద్ (కొమరిగిరి) తదితరులు పాల్గొన్నారు.

'వన్యప్రాణులను కాపాడుకోవాలి'



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యానికి జీవం పోసే భాగాలని, వాటిని కాపాడకపోతే మన భవిష్యత్తు సురక్షితం కాదని జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రరావు అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా 'ప్రకృతి పరిరక్షణకు విద్యార్థుల్లో చైతన్యం అవసరం' అంశంపై కాకినాడ వివేకానంద పార్కు ఆవరణలోని గ్రంథాలయంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎఫ్‌వో రామచంద్రరావు, విశిష్ట అతిథిగా కోరింగ వన్యప్రాణి అభయారణ్య ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు హాజరయ్యారు. పోటీల్లో జిల్లాలోని 84 పాఠశాలలు, కళాశాలల నుంచి 628 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా అటవీ శాఖాధికారులు, గ్రంథాలయ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు చలపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతారామరాజు పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలుసులపేటలో అభివృద్ధి పనులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) మంగళవారం శ్రీకారం చుట్టారు. రూ.21లక్షలతో ఆధునీకీకరించిన అల్లూరి సీతారామరాజు పార్కును ఎమ్మెల్యే రాజప్ప ప్రారంభించగా సీతారామరాజు విగ్రహాన్ని ఎంపీ ఆవిష్కరించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, కొండపల్లి కృష్ణమూర్తి, దేవళ్ల జయలక్ష్మి, నేతల హరిబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, సరోజావాసు, కమిషనరు శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

'బాణసంచా విక్రయంలో భద్రతా చర్యలు పాటించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయంలో భద్రతా చర్యలు పాటించాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. ఈ నెల 20న దీపావళి పండుగ నేపథ్యంలో మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని బాణసంచా తయారీదారులు, విక్రయదారులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. తాత్కాలిక విక్రయదారులు నిర్దేశించిన పరిమాణం ప్రకారమే బాణసంచాను దుకాణాల్లో ఉంచాలన్నారు. తహసీల్దార్లు, సీఐలు, డివిజనల్ ఫైర్ ఆఫీ సర్ సుబ్బారావు, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, వాణిజ్య పన్నులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తయారీ సంస్థల్లో తనిఖీలు

సామర్లకోట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురం, జి.మేడపాడు, వేట్లపాలెంల్లో బాణసంచా తయారీ సంస్థలను తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సీఐ కృష్ణభగవాన్, శ్రీహరి జగన్నాథ్, వీఆర్వోలు కేవీవీ శ్రీను, మామిడాల కామరాజు తనిఖీ చేశారు. తయారీదారులు గుండేపల్లి అబ్బన్న (మీనాచార్యులు), కొసనా హరిబాబు, కొసనా బాబ్జీ, గుంటముక్కల సత్యనారాయణ, వల్లూరి రాంబాబు, అడబాల నానిలకు పలు సూచనలు చేశారు. శివకాశి బాణసంచా విక్రయశాలలను కూడా తనిఖీ చేసి అధిక మొత్తంలో నిల్వలను ఒకేచోట ఉంచరాదని హెచ్చరించారు.

'చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలి'

గొల్లప్రోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను గొల్లప్రోలులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక నాయకులతో కలిసి ఎంఈవో బి.శివప్రసాద్ ఆవిష్కరించారు. చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు మాట్లాడుతూ 6, 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు అర్హులని, పాల్గొనే వారి వివరాలను ఈ నెల 10వ తేదీలోగా తెలియజేయాలని, ఇతర వివరాలకు 970187 9565 నెంబరును సంప్రదించాలని సూచించా రు. జేవీవీ గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం, అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, హెచ్ఎం సూర్యప్రకాశరెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు, పిఠాపురంలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు, ఏఐవైఎం, ప్రజా సంఘాల ప్రతినిధులు

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి నిరసన

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ బార్ అసోసియేషన్ నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడిని భారత న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తామన్నారు. ఈ ఘటనపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కోలా శ్రీహరిరావు మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు పిల్లి శ్రీనివాసు గౌడ్, వసంతకుమారి, జేవీ రమణ, సరోజ, దివ్యశ్రీ. మంగ శివరామకృష్ణ, కుంచే శ్రీహరి, రాజబాబు, సంజీవ్‌కుమార్, స్వామి ముఖేష్ పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నేతలు ఇంద్రపాలెం వంతెన సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. వేదిక కన్వీనర్ అయితాబత్తుల రామేశ్వరరావు, న్యాయవాది జవహర్ ఆలీ, వివిధ సంఘాల నేతలు కరణం ప్రసాదరావు, సిద్ధాంతుల కొండబాబు, జె.వెంకటేశ్వర్లు, మోతా కృష్ణమూర్తి, భయ్యా రాజేంద్రప్రసాద్, బచ్చల కామేశ్వరరావు, మోర్త రాజశేఖర్, పిల్లి రామారావు, గుబ్బల ఆదినారాయణ, ఏనుగుపల్లి కృష్ణ, పలివెల వీరబాబు, సీహెచ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన ఘటనను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని న్యాయవాదులు కోర్టుల్లో విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, న్యాయవాదులు గౌతు రాజా, గుదిమెళ్ల భాస్కరాచార్యులు, ఎస్ఎం ఆలీ, కేఎస్ఆర్ భాస్కర్, కొంగు నూకరాజు, వేళంగి వెంకటేష్, పిల్లి రవికుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రథాలపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద న్యాయవాదులు, ఏఐవైఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయా సంఘాలు, ఐలు, ఐల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ పెద్దాపురం బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తటవర్తి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై దాడులు ప్రమాదకరమన్నారు. దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు షేక్ వల్లిబాబు, మడికి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.





అంతర్జాతీయ ప్రముఖుల ప్రసంగాలను వీక్షిస్తున్న పీజీ విద్యార్థులు

అక్నూ పీజీ సెంటర్‌లో అంతర్జాతీయ వెబినార్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.మనోజ్‌దేవా ఆధ్వర్యంలో వాణిజ్య నిర్వహణ విభాగం (డీసీఎంఎస్), యురోపియన్ యూనియన్-డీసిస్ నెట్వర్క్ సంయుక్తంగా 'డ్రైవింగ్ ఇన్‌క్లూసివ్ కేర్-ఎకనామిక్ డెమొక్రసీ అండ్ ద సోషల్ ఎకానమీ' అంశంపై మంగళవారం అంతర్జాతీయ వెబినార్ నిర్వహించారు. ఆర్థిక ప్రజాస్వామ్యం, సామాజిక ఆర్థిక వ్యవస్థ, సమగ్ర అభివృద్ధి వంటి కీలక అంశాలపై స్టెఫాన్ ఇచెవా లీవ్, అన్నా గలాజ్కా, ఫెడరిక్ డుఫేస్, ఫ్రాంజిస్కా గోర్మార ప్రసంగించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమ నిర్వాహకులైన బెల్జియానికి చెందిన డావిదే దురాంటే, యురోపియన్ డీసిస్ నెట్వర్క్ బృందానికి మనోజ్‌దేవా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ వెబినార్‌లో పాల్గొనడం ద్వారా సామాజిక ఆర్థిక వ్యవస్థ, ఇంక్లూజివ్ ఎకానమీ, భారత్-యురోపియన్ సహకారం వంటి అంశాలపై విద్యార్థులకు విలువైన సమాచారం, విజ్ఞానం లభిస్తుందన్నారు. హెచ్‌వోడీ డాక్టర్ మధుకుమార్, అధ్యాపకులు డాక్టర్ అప్పారావు, డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ ఉమారజిత తదితరులు పాల్గొన్నారు.

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు



పుష్కరిణిలో నీరు తొలగించిన దృశ్యం

పిఠాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ పుష్కరిణిలోని నీటిని మరోమారు తొలగించారు. 15 రోజుల వ్యవధిలో రెండోసారి తొలగింపు చేపట్టారు. పుష్కరిణిని శుభ్రం చేయడంతో పాటు మిగిలి ఉన్న వ్యర్థాలను తొలగించనున్నారు.

కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న పుష్కరిణిలో నిత్యం అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇందు కోసం దానిని నిరంతరం శుభ్రం చేస్తారు. ఈసారి మహాలయ పక్షాల సమయంలో భారీగా భక్తులు తరలిరావడం, పిండ ప్రదానాల అనంతరం పిండాలను, ఇతర సామగ్రిని పుష్కరిణిలో కలపడంతో నీరు కలుషితం కావడంతో పాటు రంగు మారింది. ఈ నేపథ్యంలో మహాలయ అమావాస్య అనంతరం పుష్కరిణిలో నీటిని తొలగించారు. విజయదశమి పర్వదినాన పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించాల్సి రావడంతో మరలా నీరు పెట్టారు. ఇదే సమయంలో కలెక్టర్ షాన్‌మోహన్ పుష్కరిణిని పరిశీలించి నీటిని పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా పుష్కరిణిలో నీటి తొలగింపు చేపట్టారు. ప్రస్తుతం నీరు తొలగించడంతో పుష్కరిణిలో ఉన్న వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయనున్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలోగా పాదగయను మరలా నీటితో నింపనున్నారు. పాదగయకు తరలివచ్చే భక్తులు, మాలధారులు స్నానాలు ఆచరించేందుకు వీలుగా కుళాయిలతో పాటు జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేసినట్టు కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. పుష్కరిణిలో నీరు తొలగించామని, మరోమారు పూర్తిగా శుభ్రం చేసిన అనంతరం నీరు పెడతామని చెప్పారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న మెడికవర్ వైద్యులు

సామర్లకోట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్ మహిళల్లో అత్యధికంగా కనిపించే క్యాన్సర్లలో ఒకటని సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ప్రషోబ్‌కుమార్ తెలిపారు. అక్టోబరు నెలను బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవంగా పేర్కొంటూ మంగళవారం సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ అనుపత్రి ఆవరణలో సదస్సు నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయవంతంగా చేయవచ్చన్నారు. రొమ్ము క్యాన్సర్ సమస్యను అధిగమించడంలో స్క్రీనింగ్ అత్యంత కీలకమన్నారు. రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఆరోగ్యమైన జీవనశైలి, సరైన ఆహారం, వ్యాయామం, నిర్దేశిత వైద్య పరీక్షలతో రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. సెంటర్ హెడ్ శుభాకరరావు ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీని ఆవిష్కరించారు. ఈ నెలాఖరు వరకు ఉచిత పరీక్షలు చేయించుకోవచ్చని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో రామయంపాలెం, సింగరంపాలెం గ్రామాలకు బుధవారం ఉదయం 8గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ బి.వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. సింగరాయంపాలెం నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. పామాయిల్ ఇండస్ట్రీస్‌కి కూడా సరఫరా ఉండదన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మారేడుమిల్లిలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా వాల్మీకి జయంతి

మారేడుమిల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతిని మారేడుమిల్లిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు వాల్మీకి నాయకులు నివాళులర్పించారు. వాల్మీకి మండల అధ్యక్షులు గొర్లె అనుదీప్‌కుమార్ మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన వాల్మీకి చిరస్మరణీయుడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొర్లె అనీల్ ప్రసాద్, మండల వాల్మీకి కమిటీ నాయకులు డి.సువర్ణకుమార్, లక్కొండ పాలబుజ్జి, లక్కొండ దావీదు, దూడ బ్రహ్మాజీ, గడుసూరి కిషోర్‌కుమార్, సువర్ణ రాజు, పరమయ్య తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో...



వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీత

రంపచోడవరం, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి రామాయణాన్ని అవగాహన చేసుకొని రానున్న తరాలకు తెలియజేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ఎస్టీ కమిటీ డైరెక్టర్ సునీత, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మంగళవారం స్థానిక వాల్మీకిపేటలో వాల్మీకి విగ్రహానికి డెబొర సునీత, శీతంశెట్టి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లె చిన నారాయణరావు వాల్మీకి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వై.నిరంజనీదేవి, గొర్లె భవాని, గొర్లె రమాదేవి, వై.భూచక్రం, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తేడులో...: వై.రామవరం మండలం గుర్తేడులో మంగళవారం హిందూ వాల్మీకి జయంతిని నిర్వహించారు. స్థానిక గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా దారగడ్డ, పాతకోట, చావడికోట, వేటుకూరు గ్రామాలకు చెందిన పెద్దలు, నాయకులు హాజరై వేడుకలు నిర్వహించారు.

ఐటీడీఏలో...: రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఐటీడీఏ ఏపీవో(జీ) వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రామాయణం చదవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డేవిడ్, ఎస్‌వోటీ మార్తమ్మ, డీడీ కార్యాలయ సూపరింటెండెంట్లు బి.కిషోర్, రాజారెడ్డి, మేనేజర్ బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు వేదవతి, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో...

రాజవొమ్మంగి అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం వాల్మీకి జయంతిని జరిపారు. రాజవొమ్మంగి గ్రామంలో వాల్మీకి జయంతిని వజ్రపు అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వాతంగి గ్రామంలో రాళ్లగడ్డ అర్జున్ ఆధ్వర్యంలో జరిగాయి. వాల్మీకి విగ్రహాలకు వారు నివాళులర్పించారు.



జీఎస్టీపై తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు లాభం

మోతుగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాలలో విశాఖ నుంచి జీఎస్టీ అధికారి అమరేశ్వరరావు తన బృందంతో కలిసి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు శ్యామ్‌సన్, ఉపాధ్యాయురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు ఫస్ట్ ప్రైజ్ కోరాడ రామ్ చరణ్, సెకండ్ ప్రైజ్ రవ్వ నవ్యదీప్తి, థర్డ్ ప్రైజ్ వేముల ఇజ్రాయిల్ బహుమతులు పొందారు.



ఆశావర్కర్లకు నియామక పత్రాలు అందించిన చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్

అంకితభావంతో పనిచేయాలి

చింతూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు అంకిత భావంతో పని చేయాలని చింతూరు ఐటీడీఏ పీఓ శుభం నొక్వాల్ పేర్కొన్నారు. ఇటీవల చింతూరు డివిజను పరిధిలో ఆశావర్కర్ల నియామకాలు నిర్వహించారు. మంగళవారం నియమితులైన 27 మంది ఆశా వర్కర్లకు పీవో తన కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. తదుపరి పీవో మాట్లాడుతూ డివిజనులో 18 ఆశావర్కర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని వాటి భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

గొండు బొబ్బిలి కొమరం భీమ్‌కు నివాళి

దేవీపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గొండు బొబ్బిలి కొమరం భీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంగళవారం ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ నివాళులర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదివాసీ యువతీ, యువకులు కొనసాగించాలన్నారు.

ఎంసీడీ గ్రామంలో మైత్రీ సదస్సు

మోతుగూడెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలో ఉన్న ఎంసీడీ గ్రామంలో పోలీసులు మైత్రి సదస్సు నిర్వహించారు. గిరిజనులకు మోతుగూడెం ఎస్‌ఐ ఎస్‌కె సాదిక్ గంజాయి రవాణా, సారాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తమ పిల్లలను పాఠశాలలో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. వ్యవసాయంలో యంత్రాలను ఉపయోగించడం వల్ల కలిగే లాభాలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన పెద్దలు గ్రామస్తులు సిబ్బంది పాల్గొన్నారు

పారిశుధ్య కార్మికుడికి పురస్కారంపై హర్షం



వై.రామవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం పంచాయతీలో చెత్త సేకరణ పనుల్లో పనిచేస్తున్న క్లాప్ మిత్ర సైనం ప్రసాద్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ అవార్డును పాడేరులో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొనగా ఎంపీడీవో బాపన్న దొర, సిబ్బంది అవార్డు గ్రహీతను అభినందించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

భజన గురువులకు గౌరవ వేతనం ఇవ్వాలి



దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): భజన గురువులకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో కళాక్షేత్రం సభ్యులు మంగళవారం దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ భ్రమరాంబకు వినతిపత్రం అందజేశారు. విజయవాడలోని దేవదాయ, ధర్మదాయ శాఖ కార్యాలయానికి తరలివెళ్లి వినతి అందజేశారు. భజన గురువులకు గౌరవవేతనంగా రూ.10వేలు మంజూరు చేయాలన్నారు. దేవస్థానాల్లో దర్శనాలు, భోజన సదుపాయం కల్పించాలని కోరారు. అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో నిరంతర హరినామ సంకీర్తన, భజనలకు అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హిందు ధర్మ పరిరక్షణకు పాటుపడుతున్న సాధు సత్సంగాలు, హరిదాసులకు దర్శనాలు, వసతి సౌకర్యాలు, విజయవాడలో సాధుభవనం, గౌరవ వేతనాలు అందజేయాలని కోరారు. అనంతరం అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామిజీని విజయవాడలో సన్మానించారు. కార్యక్రమంలో పీఠాధిపతి విజయశంకర స్వామిజీ, కాకినాడ జిల్లాకు చెందిన కళాక్షేత్రం, ఉత్తర కోస్తా జిల్లా అధ్యక్షుడు సానానూకరాజు నాయుడు, కాళి ప్రసన్నానంద మాతాజీ, కాకిమాను నాగేశ్వరరావు, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు మన్యం, ఏలూరు జిల్లాలకు చెందిన నాయకులు రెడ్డి సునీత, ఎం.తులసి, కుంపట్ల బాబినాయుడు, ఎం.అప్పారావు, ఎ.రాఘవ, రామారావు, సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

తునిలో జోరు వాన

జలమయమైన రహదారులు, 'లోవ'లో భక్తులకు అవస్థలు



లోవలో కురుస్తున్న వర్షం

తుని రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తునిలో మంగళవారం కురిసిన జోరువానతో జన జీవనం స్తంభించింది. మధ్యాహ్నం వరకు భానుడు ప్రతాపం చూపగా సాయంత్రం మబ్బులు కమ్ముకుని మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన జడివానతో రహదారులు జలమయమయ్యాయి. జాతీయ రహదారిపై వర్షం తాకిడికి వాహనాలు నిలిచిపోయాయి. తలుపులమ్మ లోవ దేవస్థానంలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రత్తి, వరి పంటలు నీట మునిగాయి.

ప్రత్తిపాడులో భారీ వర్షం



ధర్మవరం రాజగోపాలస్వామి వీధిలో నిలిచిపోయిన వర్షం నీరు

ప్రత్తిపాడు,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. ప్రత్తిపాడుట్రెజరీ, అల్లూరి సెంటర్ వర్షం నీటితో చిన్నపాటి చెరువులా మారాయి. ధర్మవరం రాజగోపాల స్వామివీధి జలమయమైంది. భారీవర్షం ఖరీఫ్ వ్యవసాయానికి మేలుచేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరించి ధర్నా



ప్రత్తిపాడు కోర్టు వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ప్రత్తిపాడు కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు దాడిని నిరసిస్తూ నినాదాలు చేశారు. దాడి విచారకరమని, ఇది యావత్ భారత్ న్యాయవ్యవస్థపై జరిగిన దాడి అని బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు తెలిపారు. దాడి చేసిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో బార్ సెక్రటరీ సోము గౌరీశంకర్, కోశాధికారి పలివెల నాగేంద్రరాజు, బార్ మాజీ అధ్యక్షుడు బుగతా శివ, చిట్టెం శెట్టి పుల్లయ్య, బంగుకూరి మధుబాబు, ఆకాశపు మల్లేశ్వరరావు, లింగంపల్లి శివకుమార్ చిలపర్తి శ్రీనివాస్, రాయి అచ్చుతరామారావు, మాదాల మంజూషా, కలవపల్లి సుజన, కందా వెంకట్రాజు, దాడి రవి, పయాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వినతిపత్రాన్ని జడ్జి ఎల్.గోపీనాథ్‌కు అందజేశారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు



లింగంపర్తిలో జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో అన్ని ప్రజలకు మేలు జరుగుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ అన్నారు. మంగళవారం లింగంపర్తి గ్రామంలో సూపర్ సిక్స్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ2.0 అన్ని వర్గాలకే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. దుకాణదారులు, ప్రజలకు కరపత్రాలు పంచి జీఎస్టీ తగ్గింపుపై కలిగే ప్రయోజనాలు వివరించారు. టీడీపీ మండలా ధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీ దేవి, లింగంపర్తి సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్, బసా ప్రసాద్ పాల్గొన్నారు.

శబరిమాత విగ్రహానికి పూజలు



కూనవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కూనవరంలోని శబరి నది ఒడ్డున నిర్మించిన శబరిమాత విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీఅశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏడాది భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం అర్చకులు ఇక్కడ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. శబరినదిలో కుంకుమ చీరను ఈసందర్భంగా వదిలారు. మంగళవారం భద్రాచలం దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు నరసింహచార్యులు, మదన మోహనాచార్యులు, రమేష్ తదితరులు శబరి మాత విగ్రహానికి పూజలు నిర్వహించారు.

'ఆదిత్య'లో వర్క్‌షాప్ ప్రారంభం

గండేపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం కంప్యూటర్ అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై ఐదు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైందని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌నకు సంస్థ టెక్నికల్ ట్రైనర్ ఎస్.వరప్రసాద్‌రావు నేతృత్వం వహిస్తున్నారు. ఈవర్క్‌షాప్ ప్రస్తుతం టెక్నాలజీ రంగంలో పెరుగుతున్న అవకాశాలు, కీలకమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తుందన్నారు. ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టరు ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, విభాగాధిపతి డాక్టర్ ఎం.వంశీకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. తుమ్మలపల్లి రమేష్ హాజరై పేదలకు అన్నం వడ్డించారు. 500మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పాఠశాల అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న సత్యనారాయణ

జగ్గంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్రంపాలెం గ్రామ పంచాయతీలోని సగరపేట మోడల్ ప్రైమరీ స్కూల్ అభివృద్ధికి గ్రామానికి చెందినడిప్యూటీ పారా మెడికల్ రిటైర్డ్ ఆఫీసర్ పడాల వీరవెంకట సత్యనారాయణ రూ.50వేలు విరాళాన్ని మంగళవారం ప్రధానోపాధ్యాయులు హరిబాబుకు అందజేశారు. దాతను పలువురు అభినందించారు. ఉపాధ్యాయులు రామ్మూర్తి, దుర్గా భవాని, శిల్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



పంట నమోదు పరిశీలిస్తున్న అధికారులు

జగ్గంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కొన్ని గ్రామాల్లో పంట నమోదు నత్తనడకన సాగుతుందని, పంటకు కావలసిన ఎరువులు, విత్తనాలు, కొనుగోలు కేంద్రాలు, తదితర అంచనాలకు పంట నమోదు తప్పనిసరి అని జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు గరిమెళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో ఈ పంట నమోదును మంగళవారం ఆయన పరిశీలించారు. డివిజన్‌లో వరి 29,625 ఎకరాలకు 26,949 ఎకరాలు (90) నమోదైందని తెలిపారు. రైతులు సిబ్బందికి పంట నమోదుకు సహకరించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

జగ్గంపేట సీఐ తనిఖీలు



తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్

జగ్గంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాలతో జగ్గంపేటలోని ట్రాన్స్‌పోర్టు, కొరియర్ ఆఫీసులను మంగళవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, సిబ్బందితో తనిఖీ చేశారు. దీపావళి మందులు, ఇతర పేలుడు, నిషేధిత పదార్థాలను ట్రాన్స్‌పోర్టు సర్వీస్, కొరియల్ ద్వారా రవాణా చేయరాదన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సహకరించాలని ఆయన కోరారు.

ఏటీఎంల వద్ద జాగ్రత్త అవసరం

జగ్గంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల వద్ద నగదు విత్‌డ్రా చేసేటప్పుడు ఖాతాదారులు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ టీ.రఘునందరావు తెలిపారు. తెలియని వ్యక్తులతో ఫోన్‌పే, గూగుల్‌పే చేయించుకోరాదన్నారు. అలాగే ఏటీఎంల వద్ద మాస్కులు, హెల్మెట్లు, టోపీలు ధరించి ఉన్న వ్యక్తులు ఉంటే అప్రమత్తంగా ఉండాలన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

జగ్గంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి'



రంగవల్లి నగర్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని, భారత సరుకులపై అమెరికా భారీగా విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రామవరం గ్రామ పరిధి రంగవల్లి నగర్‌లో ధర్నా నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ వివిధరకాల భారత సరుకుల దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు పెంచడం వల్ల మన దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన దేశ ప్రయోజనాలు, సార్వ భౌమత్వ పరిరక్షణకు నిలబడాలన్నారు. కేంద్ర పాలకులు చైనాను బూచిగా చూపించడం మానుకుని మన దేశ ప్రయోజ నాల కోసం సరిహద్దు దేశాలతో సానుకూల సంబంధాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు, సూరిబాబు, గంగమ్మ, భారతి, రాంబాబు, వీరబాబు, రవణ, తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

చింతలూరులో లిబరేషన్ కార్యకర్తల ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న లిబరేషన్ కార్యకర్తలు

ప్రత్తిపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ లిబరేషన్ 11వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని మంగళవారం చింతలూరులో లిబరేషన్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఈనెల 28న జగ్గంపేటలో జరిగే జిల్లా మహాసభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు ప్రజలు తరలిరావాలని లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, లోకల్ కమిటీ నాయకులు నాగేశ్వరావు, బోడపాటి సుదర్శన పిలుపునిచ్చారు. అలాగే డిసెంబర్ 6,7 తేదీల్లో 9వ రాష్ట్ర మహాసభలను కూడా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరట రమణ సేనాపతి సన్యాసిరావు, మాసా రాజమణి, లోడా చిన్న తలి, బాలరాజ్, కాకర నేరెళ్లమ్మ, దుమ్ముల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి విశిష్ట పూజలు



అమ్మవారి కుంకుమార్చనలో మహిళా భక్తులు

ప్రత్తిపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి అడ్డురోడ్డు వద్ద గల అరుణాచలేశ్వర దేవస్థానంలో అపీతకుచాంబ అమ్మవారికి మంగళవారం విశిష్ట పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకులు రమణానంద స్వామి ఆధ్వర్యంలో పలు పూల మాలలతో ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. వలంటీర్లు ఎల్.తాతాజీ, కారే శ్రీరామచంద్ర, జక్కు త్రిమూర్తులు, మాతాజీ, దేవి పాల్గొన్నారు.

ధర్మవరం రామాలయం వద్ద అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుశీల అబ్బాయి

ప్రత్తిపాడు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం జువ్వల వీధి రామాలయం వద్ద అన్నసమారాధనను మంగళవారం గ్రామసర్పంచ్ బెంతుకర్తి సుశీల అబ్బాయి ప్రారంభించారు. తోపాటి బాబ్జీ, సత్యవతి దంపతుల ఆర్థిక సహాయంతో చేపట్టారు. కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్రం జిల్లా అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు, ఎంపీటీసీ జువ్వల సుజాత, సొసైటీ మాజీ అధ్యక్షుడు జువ్వల చినబాబు, గ్రామపెద్దలు పెదిరెడ్డి కాసులు, జువ్వల దొరబాబు, జువ్వల శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేశారు .. రహదారి మాట మరిచారు

రౌతులపూడి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజవరం నుంచి గంగవరం, దిగి శివాడ వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గోతులతో ప్రయా ణం చేయడానికి వీలులేకుండా ఉంది. మూడు నెలల క్రితం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రహదారి పనులు చేపట్టలేదు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టి కష్టాలు తీర్చాలని మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మూడు నెలల క్రితం వేసిన శిలాఫలకం

స్పార్క్ ఫౌండేషన్ సీఈవోకు ప్రశంసాపత్రం



కేంద్రమంత్రి నుంచి జాతీయ ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రదీప్

ఏలేశ్వరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్పార్క్ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్టు మంగళవారం ఫౌండేషన్ చైర్మన్ సాయి సందీప్ తెలిపారు. భారత ప్రభుత్వం డెహరాడూన్‌లో అటవీశాఖ అకాడమీ నేతృత్వంలో అడవుల సంరక్షణ, పరిశోధన అంశాలపై పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయిలో ఏడు జట్లు పాల్గొనగా ఏపీకి చెందిన స్పార్క్ ఫౌండేషన్ సీఈవో సాయి ప్రదీప్ టీమ్‌కు చోటుదక్కింది. కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ నుంచి సీఈవో ప్రదీప్ ప్రశంసాపత్రం అందుకున్నారు.

టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి : సీఐ



నెల్లిపూడి శివారు బాణసంచా దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

శంఖవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): టపాసుల విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు అన్నారు. మంగళవారం నెల్లిపూడి శివారులో ఉన్న టపాసుల హోల్‌సేల్, బాణసంచా తయారీ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలు భారీగా ఎగుమతి చేయరాదని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిక్షణ పొందిన సిబ్బందిని మాత్రమే నియమించుకోవాలన్నారు. వృద్ధులు, చిన్నారులతో పనులు చేయించవద్దన్నారు. ఆయన వెంట అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు, ప్రసాద్ సిబ్బంది ఉన్నారు.